# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :208 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 22-10-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఆందోళనకరంగా ఉద్యోగాల కల్పన

ముంబై,దేశంలో ఐటి ఉద్యోగాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పలు దిగ్గజ సంస్థలు ఉద్యోగులను ఉన్నపళంగా తొలగించడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. కొత్తగా ఉద్యోగాల కల్పన కూడా అంతంతమాత్రంగానే ఉంటోంది. పట్టాలు పుచ్చుకుని బయటకు వస్తున్న వారిలో చాలామంది ఉద్యోగాలు దొరక్క ఆందోళన చెందుతున్నారు. దేశీయ ఐటీ దిగ్గజ సంస్థలు ఆరేడు త్రైమాసికాలుగా వెల్లడిస్తున్న ఆర్థిక ఫలితాల్లో నికర ఉద్యోగుల సంఖ్య తగ్గడమే కానీ, పెరిగింది లేదు. అయితే తాజా జులై–సెప్టెంబరు ఫలితాల్లో మాత్రం ఇందుకు భిన్నంగా ఉద్యోగుల సంఖ్య పెరగడం, తాజా ఉత్తీర్ణుల ఎంపికలనూ ప్రణాళిక మేరకు చేపడుతున్నామని ఆయా యాజమాన్యాలు ప్రకటించడం.. ఉద్యోగార్థులకు భవిష్యత్తుపై ఆశలు చిగురింప చేశాయనే చెప్పాలి. ఇప్పటివరకు ఫలితాలు ప్రకటించిన 5 కంపెనీలు (టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, టెక్‌మహీంద్రా, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ) కలిపి సెప్టెంబరు త్రైమాసికంలోనే నికరంగా 17,500 కొత్త నియామకాలు జరిపాయి. హెచ్‌సీఎల్ టెక్‌లో 780 మంది తగ్గారు.

## రైతుబంధు ఎగిరిపోయింది..రాబందుల రెక్కల చప్పుడు మిగిలింది



హైదరాబాద్,అక్టోబర్21: అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన నినాదం గుర్తుందా అంటూ ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు రాదని తామన్నామని, ఇప్పుడు అదే అక్షర సత్యం అయిందని విమర్శించారు. ఎకరానికి రూ.15 వేలు ఇస్తామన్నవారు, రూ.10 వేలకే ఎగనామం పెట్టారని పేర్కొన్నారు. 'రైతుబంధు కావాలా..? రాబందు కావాలా..? ఎన్నికల ముందు బీఆర్ఎస్ ఇచ్చిన నినాదం గుర్తుందా..? రైతుబంధు ఎగిరిపోయింది..రాబందుల రెక్కల చప్పుడే మిగిలింది! నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్టుంది పరిస్థితి..! ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఊదరగొట్టి..ఉన్న పదివేలు ఊడగొట్టారు..! పంట పెట్టుబడి ఎగ్గొట్టడం అంటే..అన్నదాత వెన్ను విరవడమే..! రైతు ద్రోహి కాంగ్రెస్..చరిత్ర నిండా అనేక రుజువులు..ఇప్పుడు ఇంకొకటి ! రైతు ద్రోహి సీఎం రేవంత్ రెడ్డిని వదిలేదే లేదు' అని కేటీఆర్ తన ఎక్స్ పోస్ట్ లో విమర్శలు గుప్పించారు. రైతు భరోసా నిబంధనలంటూ కమిటీలు వేస్తూ కాలయాపన చేస్తున్నారని బీఆర్ఎస్ విమర్శించింది. ఆదివారం వివిధ జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలు తెలిపాయి. ఈ మేరకు ఆ పార్టీ ఇవాళ ఎక్స్ లో చేసిన ఓ పోస్ట్ ను కేటీఆర్ రీపోస్ట్ చేశారు. 'రైతులకు మద్దతుగా జిల్లా, మండల కేంద్రాల్లో ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. రైతులకు ద్రోహం చేసిన రేవంత్, ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేసి.. వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. రేవంత్ సర్కారు హామీలను అమలు చేయకుండా అన్నదాతలను నయవంచనకు గురిచేసింది. ఇప్పటికే రుణమాఫీ విషయంలో కర్షకులను వంచించిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు రైతు భరోసా విషయంలోనూ మరోసారి మోసం చేసింది. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి మోసాలు మరోసారి బయటపడ్డాయి. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాల్సిందే. గడచిన వానకాలం రైతుభరోసా ఇవ్వబోమంటే ఊరుకోం. సబ్ కమిటీ నివేదిక వచ్చాకే యాసంగి సాయం అందిస్తామంటే సహించబోం' అని బీఆర్ఎస్ అధికారిక ఎక్స్ అకౌంట్లో పోస్ట్ చేసింది.

## ఆర్థిక ఇబ్బందుల్లో సమర్థ పనితీరు

న్యూఢిల్లీ,అక్టోబర్21:ప్రపంచం మొత్తం కొవిడ్, యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో ఇబ్బంది పడుతున్న వేళ కూడా మన దేశంలో 'భారత్ శతాబ్ది' గురించి ఆలోచిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. ఆయన 'ది ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్'లో ప్రారంభోపన్యాసం చేశారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణంలా కనిపిస్తోందన్నారు. దేశం ప్రతి రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని అభివర్ణించారు. 'మా ప్రభుత్వం ఇప్పటికే 125 రోజులు పూర్తి చేసుకొంది. ఈ కాలంలో మా ప్రభుత్వ అనుభవాన్ని మీతో పంచుకుంటాను. పేదలకు 3 కోట్ల కొత్త పక్కా గృహాలు ఇచ్చాం. రూ.9 లక్షల కోట్ల ఇన్ఫ్రా ప్రాజెక్టులపై పని మొదలైంది. 15 వందేభారత్ రైళ్లు ప్రారంభించాం. 8 కొత్త ఎయిర్ పోర్టుల పనికి శ్రీకారం చుట్టాం. యువతకు రూ.2లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ ఇచ్చాం. రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లను బదిలీ చేశాం. 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచిత వైద్యానికి ఏర్పాట్లు చేశాం. 5 లక్షల ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేశాం. స్టాక్‌మార్కెట్ సూచీల్లో దాదాపు 7 శాతం వృద్ధి నమోదైంది. విదేశీ మారకద్రవ్యం 700 బిలియన్ డాలర్లను దాటేసింది. నేను కేవలం 125 రోజుల్లో జరిగిందే చెబుతున్నాను. ఈ కాలంలో భారత్‌లో ప్రపంచం మూడు విషయాలు చర్చించడానికి వచ్చింది. టెలికామ్–డిజిటల్ ఫ్యూచర్‌పై అంతర్జాతీయ అసెంబ్లీ జరిగింది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్ నిర్వహించారు. గ్లోబల్ సెమీకండెక్టర్ ఎకోసిస్టమ్‌పై సదస్సు జరిగింది. ఇవి భారత్ దిశ.. ప్రపంచం ఆశను



తెలియజేస్తున్నాయి. ప్రపంచ భవిష్యత్తును భారత్ నిర్ణయిస్తుంది. మా ప్రభుత్వ మూడో విడత పాలనతో రేటింగ్ ఏజెన్సీలు దేశ వృద్ధిరేటును గణనీయంగా పెంచాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న దేశమని ప్రధాని మోదీ అభివర్ణించారు. పేదల కష్టాలు తమకు బాగా తెలుసన్నారు. ఈ కార్యక్రమానికి ముందు ఆయన సదస్సులో పాల్గొనడానికి వచ్చిన విదేశీ అతిథులను కలుసుకొన్నారు. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో యూకే మాజీ ప్రధాని డేవిడ్ కామరూన్, భూటాన్ ప్రధాని దాసో త్సేరింగ్ టోబ్గే, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ మిత్తల్ తదితరులు పాల్గొననున్నారు.

## గ్రూప్-1 పరీక్షల్లో జోక్యం చేసుకోలేం

న్యూఢిల్లీ,అక్టోబర్21: తెలంగాణ గ్రూప్–1 అభ్యర్థుల పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వుల్లో అన్ని అంశాలూ స్పష్టంగా చెప్పిందని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొంది. ఫలితాల విడుదలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ గ్రూప్–1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తీర్పు వచ్చే వరకు పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని గ్రూప్–1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వ్‌డుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా.. రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్–1 పరీక్షలు నిలిపివేయాలని కొందరు అభ్యర్థులు కోరగా.. హైకోర్టు నిరాకరించింది. నోటిఫికేషన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ఉన్నత న్యాయస్థానం.. నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని విచారణ వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో గ్రూప్–1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో సోమవారం నుంచి జరగాల్సిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు లైన్ క్లియర్ అయింది. మరికొద్ది గంటల్లో పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రస్తుత దశలో పరీక్షల నిర్వహణలో తాము జోక్యం చేసుకోలేమని తెలిపింది. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ఈనెల 27వ తేదీ వరకు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని టీజీపీఎస్సీ షెడ్యూల్ విడుదల చేసింది. పరీక్షల వాయిదాకు నిరాకరిస్తూ పిటిషన్‌ను తిరస్కరించడంతో దీంతో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తెలంగాణలో



గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల కోసం టీజీపీఎస్సీ పూర్తి ఏర్పాట్లు చేసింది. అక్టోబర్ 21 నుంచి 27వ తేదీ వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 46 పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేశారు. హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డి జిల్లాలో 11, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలను టీజీపీఎస్సీ ఏర్పాటుచేసింది. అన్ని కేంద్రాల వద్ద ఏవిధమైన అవకతవకలు, అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు శాఖ తెలిపింది. పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారు. 2011 తర్వాత గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ అనివార్య కారణాలతో వాయిదాపడుతూ వచ్చింది. దీంతో ఎలాంటి లోపాలు లేకుండా పరీక్షల నిర్వహణకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేసింది. ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నింటిలోనూ సీసీ టీవీలను ఏర్పాటు చేసింది. టీజీపీఎస్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ టీవీలను పర్యవేక్షించనుంది. పరీక్షల నిర్వహణలో ప్రతి షిఫ్ట్‌లో కచ్చితమైన నియమ నిబంధనలు పాటించేలా స్పష్టమైన మార్గదర్శకాలను అధికారులు జారీచేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకై ప్రత్యేక సిబ్బందిని నియమించారు.

## జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదంపై యుద్ధం ఇంకా ముగియలే



న్యూఢిల్లీ, దేశంలో ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇవాళ ఉదయం దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కార్యకలాపాలను అణచివేయడానికి భారత బలగాలు గత పదేళ్లుగా శాయశక్తులా కృషి చేస్తున్నాయని.. అయినప్పటికీ ఉగ్రవాదంపై యుద్ధం ఇంకా ముగియలేదని ఆయన అన్నారు.దేశం నుంచి ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టడానికి ఎన్డీఏ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని షా చెప్పారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశాన్ని రక్షించడానికి 36,468 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగాల వల్లే దేశం సురక్షితంగా ఉందని అమిత్ షా అన్నారు. గత ఏడాది కాలంలో దాదాపు 216 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.పోలీస్ అమరవీరుల త్యాగాలను దేశం ఎప్పటికీ మరిచిపోదని అమిత్ షా అన్నారు. తమ పదేళ్ల పాలనలో జమ్ముకశ్మీర్, వామపక్ష అతివాద ప్రభావిత ప్రాంతాల్లో శాంతి నెలకొన్నదని చెప్పారు. అయినా పోరాటాన్ని ఆపబోమని, కశ్మీర్‌లో మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, మతపరమైన ఉద్రిక్తతలను సృష్టించే కుట్రలు, చొరబాట్లకు పాల్పడుతున్న ఉగ్రవాదులకు వ్యతిరేకంగా తమ ప్రభుత్వం పోరాడుతూనే ఉంటుందని షా తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరులకు షా నివాళులర్పించారు.కాగా 1959లో లడఖ్‌లో చైనా సైనికులు జరిపిన ఆకస్మిక దాడిలో మరణించిన పోలీసులు, ఇతర అధికారుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## కాశ్మీర్ పాకిస్థాన్‌గా మారదు..

జమ్మూ :జమ్మూ కాశ్మీర్‌లోని గందర్‌బల్‌లో ఉగ్రదాడి తర్వాత, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఫరూక్ అబ్దుల్లా పాకిస్తాన్‌ను లక్ష్యంగా చేసుకున్నారు.కాశ్మీర్ పాకిస్థాన్‌గా మారదని పాక్ పాలకులకు చెప్పాలనుకుంటున్నామని ఆయన సోమవారం అన్నారు. ఈ సందర్భంగా ఫరూక్ అబ్దుల్లా మాట్లాడుతూ.. 'ఇది చాలా బాధాకరమైన సంఘటన. ఈ క్రూరమైన వ్యక్తులు దీని నుండి ఏమి పొందుతారు? దీని వల్ల ఇక్కడ పాకిస్తాన్‌ను సృష్టిస్తుందని వారు భావిస్తున్నారా? నిజంగా భారత్‌తో స్నేహం కావాలంటే దీన్ని ఆపాలని పాకిస్థాన్ పాలకులకు చెప్పాలనుకుంటున్నానని, కాశ్మీర్ పాకిస్థాన్‌గా మారదని ఆయన అన్నారు.ఆయన ఇంకా మాట్లాడుతూ.. దయచేసి మమ్మల్ని గౌరవంగా జీవించనివ్వండి, అభివృద్ధి చెందండి. ప్రజలారా మీరు ఎంతకాలం మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తారు? అని అయన పాకిస్థాన్ ను ప్రశ్నించాడు. జమ్మూ కాశ్మీర్‌లోని గందర్‌బాల్ జిల్లాలో శ్రీనగర్ – లేహ్ జాతీయ రహదారిపై సొరంగం నిర్మాణ స్థలంపై ఆదివారం ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఒక వైద్యుడు, ఆరుగురు కార్మికులు మరణించారు. గందేర్‌బల్‌లోని గుండ్‌లోని సొరంగం ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులు, ఇతర ఉద్యోగులు సాయంత్రం



తమ శిబిరానికి తిరిగి వస్తుండగా ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడ్డారు. ఈ దాడిని పలువురు నేతలు తీవ్రంగా విమర్శించారు. ఈ క్రూరమైన చర్యకు పాల్పడిన వారిని విడిచిపెట్టబోమని, భద్రతా బలగాల నుంచి కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం అన్నారు.

## విద్యార్థులు హ్యాపీ గా పరీక్షలు రాసుకోండి..



హైదరాబాద్, సుప్రీంకోర్టు తీర్పు తో విద్యార్థులు హ్యాపీగా పరీక్షలు రాసుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు.గ్రూప్ 1 పరీక్షలను వాయిదా వేయలేమని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షనీయమన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో విద్యార్థులు హ్యాపీ గా పరీక్షలు రాసుకోవాలని సూచించారు. 13 ఏళ్ల తర్వాత ఒక మంచి అవకాశం వచ్చింది.. మంచిగా ఉపయోగించుకొని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షిస్తున్నా అన్నారు. మేము మొదటి నుంచి గ్రూప్ 1 విద్యార్థులకు అండగా ఉన్నామన్నారు. ఇదే విషయాన్ని పదే పదే చెపుతూనే ఉన్నామని గుర్తు చేశారు. జీఓ 29 వల్ల రిజర్వేషన్లు అభ్యర్థులకు ఎలాంటి అన్యాయం జరగదని మరోసారి చెప్తున్నామని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వారి రాజకీయ లబ్ది కోసం గ్రూప్ 1 విద్యార్థులను పావుగా వాడుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.నేటి నుంచి గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించాలన్న సుప్రీం కోర్టు తీర్పు పై కాంగ్రెస్ ప్రభుత్వం ఆనందం వ్యక్తం చేసింది. అభ్యర్థుల తరపున కపిల్ సిబాల్ వాదనలు విన్న సుప్రీం చివరకు పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. ఇంత వరకు వచ్చి ఇప్పుడు వాయిదా వేయడం మంచిది కాదని తెలిపింది. ఇందులో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. ఇలా చేయడం వలన అభ్యర్థుల ఇంత వరకు ప్రిపేర్ అయిన సిలబస్ అంతా వ్యర్థం అవుతుందని తెలిపారు. ఇది కరెక్ట్ పద్ధతి కాదని తెలిపింది. గ్రూప్ 1 పరీక్ష యదావిధిగా కొనసాగించాలని తెలిపింది. మరోవైపు అభ్యర్థులు పరీక్ష కేంద్రాల వద్ద భారీగా చేరుకుని పరీక్ష రాసేందుకు సిద్ధమయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిటమైన ఏర్పాట్లు చేశారు. కేంద్రాల వద్దకు పోలీసులు భారీగా చేరుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

### బ్రెజిల్ అధ్యక్షుడికి తలకు గాయం

న్యూఢిల్లీ,అక్టోబర్21:బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా తలకు గాయం కావడంతో బ్రిక్స్ సదస్సు కు వర్చువల్‌గా హాజరుకానున్నారు. శనివారం రాత్రి బాత్రూంలో జారిపడటంతో ఆయన తలకు గాయం అయ్యిందని అధికారులు తెలిపారు.

## ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించవద్దు



న్యూఢిల్లీ,అక్టోబర్21: దేశంలో గత కొన్ని రోజులుగా విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాల వేళ ఖలిస్థానీ వేర్పాటువాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూ 'ఎయిర్ ఇండియా'కు హెచ్చరికలు చేయడం తీవ్ర కలకలం రేపింది. నవంబరు 1 నుంచి 19వ తేదీల మధ్యలో ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దని అతడు వార్నింగ్ ఇవ్వడం గమనార్హం. భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఎయిర్ ఇండియా విమానాలపై దాడి జరిగే అవకాశం ఉందని పన్నూ అన్నాడు. అందులో ఆయా తేదీల్లో ఆ సంస్థ విమానాల్లో ప్రయాణించొద్దంటూ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నాడు. కాగా.. పన్నూ ఇలాంటి హెచ్చరికలు చేయడం ఇది తొలిసారి కాదు. గత నవంబరులోనూ ఇలాంటి వీడియో విడుదల చేశాడు. నవంబరు 19న ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఆ రోజు మూతపడుతుందని, దాని పేరు కూడా మార్చేస్తామని గతేడాది అతడు ఓ వీడియోలో హెచ్చరించాడు. సిఖ్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటువాద సంస్థను 2007లో స్థాపించగా.. వ్యవస్థాపకుల్లో గురుపత్వంత్ సింగ్ పన్నూ కూడా ఒకడు. ఈ సంస్థను భారత్ 2019లోనే నిషేధించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం కింద భారత ప్రభుత్వం అతడిని 2020లో ఉగ్రవాదిగా ప్రకటించింది. ప్రస్తుతం అతడు అమెరికాలో ఉన్నట్లు సమాచారం. పన్నూకు అగ్రరాజ్యంతో పాటు కెనడా పౌరసత్వం కూడా ఉంది.

## సంపాదకీయం

మంగళవారం 22-10-2024

## ఎర్ర తివాచీ..!

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పెట్టుబడిదారులను రెడ్ కార్పెట్ పరిచి ఆహ్వానిస్తున్నామని సి.ఎం చంద్రబాబు నాయుడు పిలుపునిస్తూ రాష్ట్రంలో వ్యాపార అనుకూల ప్రభుత్వం ఉందని చెప్పడం ద్వారా కార్మిక, ఉద్యోగుల పట్ల సర్కారు ఎటువంటి వైఖరి తీసుకుంటుందో చెప్పకనే చెప్పినట్టయింది. కొత్త పాలసీ ఫ్రేమ్‌వర్క్ పరిశ్రమ అనుభవజ్ఞులతో సమగ్ర సంప్రదింపుల ఆధారంగా రూపొందిచామని, దేశంలో అత్యుత్తమ వ్యాపార పర్యావరణ వ్యవస్థను తాము నిర్మించబోతున్నట్లు గొప్పగా చెప్పారు. వ్యక్తిగతంగా తాను పెట్టుబడులు పెట్టేవారికి హామీ ఇవ్వాలనుకుంటున్నానని, దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముఖ్యంగా మన రాష్ట్రంలో ఇంతకంటే మంచి సమయం ఎప్పుడూ లేదంటూనే పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చేవారి కోసం ఎదురు చూస్తున్నట్లు సిఎం చెప్పడం ఈ ప్రభుత్వ ప్రాధాన్యతను విడమర్చింది. గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఉండేదనీ తమ ప్రభుత్వం ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదాన్ని ఎత్తుకుందని ఇంతకు ముందే ఆయన ప్రకటించడం పెట్టుబడిదార్లకు భరోసా కల్పించడానికే!ముఖ్యమంత్రి ప్రకటనకు వేగంగా స్పందించిన ఎ.పి ఛాంబర్స్ స్తోత్ర పాఠాలు పాడడం ఆశ్చర్యకరం కాదు. ప్రభుత్వం ఆమోదించిన ఆరు కొత్త పాలసీలతో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని, ఇప్పటి వరకూ వచ్చిన పాలసీలకంటే అత్యంత మెరుగైనవని పేర్కొన్నారు. ముఖ్యంగా పీపుల్ పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ (పిపిపిపి) పద్ధతిలో తీసుకువస్తున్న ప్రైవేటు పారిశ్రామిక పార్కులు రాష్ట్రంలో తిరుగులేని అధ్యాయాన్ని సృష్టిస్తాయని ఆనందం వ్యక్తం చేయడం ప్రజల సంపద పెట్టుబడిదార్ల పరం అవుతుందనే! పార్కుల ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని, ఇది పారిశ్రామిక వేత్తలకు కొత్త ఉత్సాహాన్ని నింపుతుందనడంలో సందేహం లేదని వివరించారు. ప్రసుత్తం ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పెరుగుతోందని, దీని ప్రభావం ఎ.పి లోనూ ఉందన్న నగ సత్యాన్ని వారు చెప్పక తప్పలేదు. అయితే నూతన పాలసీల వల్ల ఉపాధి పెరుగుతుందని చెప్పడం డొల్లతనమే. ప్రస్తుత ఎనర్జీ పాలసీలో పెట్టుబడిదారులకు అనేక సానుకూల అంశాలు ఉన్నాయని, సోలార్ ఎనర్జీకి 25 శాతం, గ్రీన్ హైడ్రోజన్‌కు 30 శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించడంపట్ల వారు ఉబ్బి తబ్బిబ్బయారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న పారిశ్రామిక విధానాలపై కార్మిక సంఘాలతో సమగ్రంగా చర్చించాలని, ఆ తర్వాతే తుది రూపం ఇవ్వాలన్న డిమాండ్లు న్యాయసమ్మతమైనవి. 20 లక్షల ఉద్యోగాలతో పాటు రూ.30 లక్షల కోట్లు పెట్టుబడులు రాబోయే ఐదేళ్లలో వస్తాయని చెప్పారు కానీ గతంలో విశాఖలో జగన్ మోహన్ రెడ్డి సమావేశం పెట్టి రూ. 24 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రకటించినా వాస్తవంగా వచ్చిన పెట్టుబడులెన్నో, ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందీ ఎవరూ చెప్పలేదు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడిచినా డిఎస్‌సి ఊసే లేదు. రాష్ట్రంలో 2.50 లక్షల ఎకరాలను సెజ్ పేర సేకరించారని, నేటికీ ఇవన్నీ ఖాళీగానే ఉన్నాయి. వాటిలో పరిశ్రమలనైనా నెలకొల్పాలి లేదా తిరిగి రైతులకు ఇచ్చేయాలి. 2008లో ఏర్పడిన కాకినాడ సెజ్‌లో నేటికీ ఒక్క పరిశ్రమ కూడా స్థాపించలేదు. ప్రకృతి వనరులను కార్పొరేట్ల పరం చేసేందుకే కేంద్రంలోని మోడీ పనిచేస్తుండగా ఇక్కడి కూటమి సర్కారు కూడా ఆ బాటనే సాగడం దారుణం. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలోవున్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రజల ఆమోదం లేకుండానే వందల ఎకరాలను ఆదానీకి కట్టబెట్టాలని చూస్తున్నారు. విశాఖ సెజ్‌లో రాత్రికి రాత్రి లాకౌట్ ప్రకటించడంతో 1000 మంది కార్మికులు వీధిన పడ్డారు. హిందూపురం, కాకినాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో వేలాది మంది మహిళలు 14 గంటల పాటు పని చేస్తున్నా కనీస వేతనాలు ఇవ్వడం లేదు. ఇలా చెబుతూ పోతే కార్మికుల కష్టాలెనెన్నో! ఉన్న పరిశ్రమలు మూత పడుతుంటే కొత్త పరిశ్రమలు ఎక్కడి నుంచి వస్తాయన్నది మరో ప్రశ్న. ఏది ఏమైనా ప్రభుత్వం కష్ట జీవులకు రక్షణ కల్పించే విధానాలు చేపట్టాలే తప్ప శతకోటీశ్వరులకు సేవ చెయ్యడం తగదు.

# ఈ నగరాలకు ఏమైంది..?



ఢిల్లీ ,అది ఒక వైభవోజ్వల మహాయుగం- వల్లకాటి అధ్వాన్న శకం, వెల్లివిరిసిన విజ్ఞానం- బ్రహ్మజెముడులా అజ్ఞానం, భక్తి విశ్వాసాల పరమపరిధవం- పరమ పాషండాల ప్రల్లద కల్లోలం, స్వర్గానికి రాచబాట పుచ్చుకున్న జనం- నడుస్తున్నారు నరకానికి సూటిగా, అరుస్తున్నారు అధికార కంఠాలు, అంతా అమోఘంగా వుందని' అంటూ ఫ్రెంచి విప్లవం సమయంలో రెండు మహానగరాల స్థితిగతులను చార్లెస్ డికెన్స్ 'ఏ టేల్ ఆఫ్ టూ సిటీస్' (రెండు మహానగరాలు) నవలలో కవితాత్మకంగా వర్ణిస్తాడు. 'భారతదేశంలోని మహానగరాల నేటి దుస్థితి నాటి పరిస్థితికి ఏమాత్రం తీసిపోదు' అంటారు ఈ నవలను అనువదించిన తెన్నేటిసూరి. ఎప్పుడు వర్షం పడినా చెన్నై నగరం చెరువైపోతుంది. హైదరాబాద్‌లో వచ్చే కుండపోత వర్షంతో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ నిల్చిపోతుంది. వాయుకాలుష్యంతో ఢిల్లీ అతలాకుతలం అవుతున్నది. ప్రతిసారీ ముంబైలో వచ్చే వరదలకు జనజీవనం స్థంభించిపోతుంది. ఇటీవల వచ్చిన వరదలతో విజయవాడ కూడా ఈ జాబితాలో చేరింది.ఎక్కడైనా నగరాల విస్తరణ, పురోగమనంఅక్కడి అసంఖ్యాక శ్రామికులు చెల్లించే జీవన మూల్యాల ఫలితమే. ఈ నగరాలే మానవ నాగరికతా వికాసాన్ని కాలగమనంలో ఆయా దశల్లో ప్రతిఫలిస్తాయి. మరికొన్ని కాలానికి సాక్షిగా నిలిచాయి. మహానగరాల జీవితం- ఆ దేశపు చరిత్రసంస్కృతితో పెనవేసుకొని వుంటుంది. అలాంటి మహానగరాల్లో దేశరాజధాని ఢిల్లీ సహా కలకత్తా, ముంబాయి, బెంగళూరు, చైన్నై, హైదరాబాద్ వంటివి చాలానే వున్నాయి. ఈ మహానగరాల చరిత్ర, కీర్తి పేరుకు మాత్రమే ఇక్కడి జీవనం మహానరకం. ఈ నగరాలను విశ్వనగరాలుగా తీర్చిదిద్దాలనుకుంటున్నాయి మన ప్రభుత్వాలు. కానీ, చిన్నపాటి వర్షాలను, ఓ మోస్తరు ఎండలను కూడా తట్టుకోలేక విశ్వగురువుల కలలు గాలిబుడగల్లా పేలిపోతన్నాయి. మ్యాన్‌హోల్స్ నోళ్లు తెరుస్తున్నాయి. కొన్ని నగరాల్లో పడవలు వాడాల్సివస్తోంది. సంపన్నుల విలాసవంతమైన భవనాలు కూడా నీళ్లలో చిక్కుకుంటున్నాయి. అసలు ఈ మహానగరాలకు ఏమైంది? ఎందుకిలాంటి పరిస్థితి ఏర్పడుతోంది? మహానగరాలు అనగానే మనకు గుర్తొచ్చేది ఆకాశాన్నంటే భవనాలు, అపార్ట్‌మెంట్‌లు, కాంక్రీట్ రోడ్లు. 'ఇతిహాసపు చీకటికోణం/ అట్టడుగునపడి కాన్పించని/ కథలన్నీ కావాలిప్పుడు/ దాచేస్తే దాగని సత్యం' అంటారు శ్రీశ్రీ. చెరువులు, చెట్లు, అడవులు, వాగులు, వంకలు ఆక్రమణల పాలవుతున్నాయి. అడవుల్లో వుండాల్సిన జంతువులుజనవాసాల్లోకి చొరబడుతున్నాయి. కుండపోత వర్షాలు, భరించలేని ఎండలు సర్వసాధారణం అయిపోయాయి. ప్రకృతి విపత్తుకి మానవ తప్పిదాలే ప్రధాన కారణమని పర్యావరణవేత్తలు అంటున్నారు. అయినా, ప్రకృతిని ప్రకృతిలా వుండనీయడంలేదు. నగరీకరణ, సుందరీకరణ పేరుతో ప్రకృతి సహజత్వం విధ్వంసమౌతోంది. ఇప్పటికీ ఈ మహానగరాల్లో దశాబ్దాల నాటి డ్రైనేజీ వ్యవస్థే కొనసాగుతోంది. వేసవిలో చెమట్లుకారే రద్దీ, వానాకాలంలో ఒళ్లంతా బురద పూసే నీటి గుంటలు తప్ప పెరుగుతున్న జనాభాకనుగుణంగా మౌలిక వసతుల్లో మార్పులు చోటుచేసుకోడంలేదు.'నా నగరాన్ని మహాసముద్రంలో చేపల్లా నిండిపోనీ జనంతో' అంటాడు కులీ కుతుబ్‌షా నాలుగు శతాబ్దాల మహానగరం హైదరాబాద్ నుద్దేశించి. పరిధిని మించి పెరిగిన జనాభాకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేక ఇప్పుడు తలబాదుకుంటున్నారు. మిగతా నగరాల పరిస్థితి కూడా దీనికి భిన్నంగా ఏమీ లేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో బహిరంగంగా చెత్తవేయడం నేరం. కానీ, మన దేశంలో పట్టించుకునే నాథుడే లేడు. 'మహానగరాన్ని నిర్మించిన/ నిర్మిస్తున్న మనుష్యుల/ మమతలు తినేసిన ఉప్పుగాలి/ అంతశ్చైతన్యాన్ని అంతం చేసి నవ్వుకున్న నగరం/ పెరుగుతూంది%ౌ%/ నిశ్చయంగా విస్తరిస్తూంది' అంటారు కవి నిఖిలేశ్వర్. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. ప్రకృతి వనరులను కార్పొరేట్ శక్తులు చెరపట్టకుండా కాపాడుకోవాలి. అప్పుడే మన మహానగరాలు విశ్వనగరాలుగా శిరమెత్తుతాయి.

# మూసీ కంటే ముందు..పోవలసింది రాజకీయ కాలుష్యమే!

హైదరాబాద్,ఒకప్పుడు హైదరాబాద్ నగరం పెహచాన్ మూసీనదితో ఉండేది. అనంతగిరిలో పుట్టి హైదరాబాద్ నగరం మీ దుగా నల్లగొండ జిల్లాలోకి వెళ్లి వాడపల్లి దగ్గర కృష్ణానదిలో కలిసే మూసీ ఒకప్పుడు జీవనది. కాలక్రమేణా ఇప్పుడు ఆ నది పేరు తలచుకోవడానికి కూడా ఇష్టపడని పరిస్థితి. 'అరయంగా కర్ణుడీల్గె ఆ ర్గురి చేతన్' అన్నట్టు మూసీ మురికికూపంగా మారడానికి చాలా కారణాలు ఉ న్నాయి. రాజకీయ నాయకుల ప్రేరేపిత ఆక్రమణలు, అధికార యంత్రాంగం అవినీతి కలగలిసి చివరికి మూసీ ఒక మురికికూపంగా తయారైంది. మూసీనది పునరుజ్జీవనానికి సంబంధించి మొ న్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సుదీర్ఘ పత్రికా గోష్ఠిలో ప్రముఖ కవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి తన నలుగురు కూతుళ్లకు నదుల పేర్లు పెట్టుకున్న విషయాన్ని ప్రస్తావించారు. నదుల్ని మనం తల్లుల్లాగా పూజిస్తాం, గౌరవిస్తాం. మరి మూసీ కూడా పవిత్రంగా పూజించదగ్గ, గౌరవించదగ్గ నదేనా? మూసీ పేరు తలచుకోడానికి కూడా ఇష్టపడని పరిస్థితి ఎందుకొచ్చింది? అని ప్రశ్నించారు ముఖ్యమంత్రి.తాను ఇప్పుడు ఆ పరిస్థితిని మార్చాలని కృతనిశ్చయంతో ఉన్నట్టు చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మంచిదే. ఆయన ఆ పని చేయగలిగితే చరిత్రలో నిలిచిపోతారు. మూసీనదికి పూర్వవైభవం కల్పించాలన్న ప్రయత్నం ఇవాళ కొత్తగా రేవంత్ రెడ్డితో ప్రారంభం కాలేదు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలువురు ముఖ్యమంత్రులు ఆ ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. మూసీని పునరుద్ధరించి హైదరాబాద్ నగరానికి కొత్త కళ తీసుకురావాలన్న కోరిక పలువురు ముఖ్యమంత్రులలో ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, ఆ తర్వాత రాష్ట్రం విడిపోయి తెలంగాణ ఏర్పడ్డాక కూడా ఆ ప్రయత్నం కొనసాగింది. కానీ ఆ ప్రయత్నాలు సమావేశాలు, చర్చలకే పరిమితమయ్యాయి. మూసీనది ఇప్పుడు హైదరాబాద్ వాసులకు ఒక కలుషిత కాసారంగానే తలపునకు వస్తుంది. దశాబ్దాల తరబడి ఎవరూ పట్టించుకోని ఆక్రమణలు, నీటి కాలుష్యం ఇందుకు కారణం.ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన సంవత్సరంలోపునే రేవం త్ రెడ్డి మూసీనది పునరుజ్జీవనాన్ని తన ప్రాధాన్యతగా ఎంచుకున్నారు. ఇంతకుముందు ముఖ్యమంత్రులు అందరూ విఫలమైన ఈ పనిలో రేవంత్ రెడ్డి కృతకృత్యుడవుతారా లేక ఇతరుల మాదిరిగా ఈయన కూడా మధ్యలో వదిలేస్తారా అనేది చూడాలి. ఇంతకు ముందు చెప్పుకున్నట్టు ఆయన ఇందులో విజయం సాధించినట్టయితే పలు కారణాలవల్ల చరిత్రలో నిలిచిపోతారు. మళ్లీ జీవనది మూసీని హైదరాబాద్ నగరవాసులకు కానుకగా ఇచ్చిన ముఖ్యమంత్రిగానే కాకుండా గత పాలకులు పూర్తి చేయలేకపోయిన ప్రాజెక్టును పూర్తి చేసినవాడు అవుతారు.గత గురువారం నిర్వహించిన పత్రికా గోష్ఠిలో ఆయన మూసీనది పునరుజ్జీవనంపట్ల తన నిబద్ధత గురించి స్పష్టంగా ప్రకటించడమే కాదు, ఈ ప్రాజెక్టును పూర్తిచేసే క్రమంలో పారదర్శకంగా వ్యవహరిస్తామని కూడా ఆయన నమ్మకం కలిగించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా, స్లైడ్ షోల ద్వారా ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీ కోసం నియమించుకోనున్న కంపెనీల పేర్లను కూడా ఆయన ప్రకటించారు. ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ ఆరోపిస్తున్నట్టుగా రూ. 1,50,000 కోట్లు కాదు ప్రస్తుతం ప్రాజెక్టు రిపోర్ట్ తయారీ కోసం రూ. 150 కోట్లు మాత్రమే ఇచ్చినట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. దానితోపాటు నిర్వాసితులైన 200 కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వడం తప్ప ఇప్పటివరకూ ఏ ఖర్చు జరగలేదని ఆయన స్పష్టం చేశారు.18 మాసాల్లో ప్రాజెక్ట్ రిపోర్ట్ అందాక ప్రాజెక్టుకి ఖర్చు ఎంత అనేది తేలుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ముందుకు సాగకుండా ప్రతిపక్షాలు రాజకీయాలు చేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజల భవిష్యత్తును గురించి ఆలోచించి తమ ప్రభుత్వం నిర్ణ యం తీసుకుంటున్నదని కూడా ముఖ్యమంత్రి చెప్పారు. ప్రతిపక్షాలు ప్రజల్ని మభ్యపెడుతున్నాయని, తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. మూసీని ప్రక్షాళన చేయకపోతే ఇప్పటికే వర్షాకాలంలో నానా ఇక్కట్లు పడుతున్న హైదరాబాద్ నగరవాసులకు ముందు ముందు చెన్నై, బెంగళూరు పరిస్థితులు దాపురిస్తాయని చెప్పారాయన.ఆయన చెప్పినట్టు ఒక వి శేషం ఉంది ఇక్కడ. ప్రపంచంలో చాలా కొద్ది నగరాల్లోనే నదులు నగరం మధ్యలో నుంచి పారుతూ ఉంటాయి. అటువంటి వాటిలో హైదరాబాద్ ఒక టి. నిజంగానే ముఖ్యమంత్రి కోరుకుంటున్నది జరిగి మూసీనది ప్రక్షాళన జరిగినట్టయితే హైదరాబాద్



నగరం మధ్య నుండి పారుతున్న ఒక గొప్ప నదిని మనం చూడవచ్చు. ఆయనే చెప్పినట్టుగా ప్రస్తుతం మూసీనది బఫర్ జోన్‌లో దాదాపు పది వేల నిర్మాణాలు ఉన్నాయి. వాటికితోడు నదీ గర్భంలో కూడా వందలాది ఆక్రమణలు కనిపిస్తాయి. మూసీనదిని ప్రక్షాళన చేసే క్రమంలో నష్టపోయేవారందరికీ సరైన పరిహారం చెల్లించడం, పునరావాసం కల్పించడం జరుగుతుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. అంతా సజావుగా జరిగితే అయిదారేళ్ల కాలంలో మూసీనది మళ్ళీ పాత వైభవం సంతరించుకుంటుందన్నది ముఖ్యమంత్రి విశ్వాసం.తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి 9 ఏళ్లకు పైగా అధికారం లో ఉన్న ప్రధాన ప్రతిపక్షం భారత రాష్ట్ర సమితి మరి ఎందుకు ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నది? మూసీ ప్రక్షాళనకు సంబంధించి ఆ పార్టీ కూడా అధికారం లో ఉండగా ప్రయత్నాలు చేసిన మాట వాస్తవం. బిఆర్ఎస్ గాని, భారతీయ జనతా పార్టీ గానీ చేస్తున్న విమర్శ మూసీ పునరుజ్జీవనం పేరిట కాంగ్రెస్ ప్ర భుత్వం అవినీతికి పాల్పడబోతున్నదని. ముఖ్యమంత్రి పత్రికా గోష్ఠి నిర్వహించిన మరునాడే భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తాను కూడా ఒక సుదీర్ఘ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సరే, ఆ పార్టీ తన వైఖరిని, ప్రక్షాళనపై తనకున్న ఆలోచనలని, తాను వాస్తవాలు అనుకుంటున్న విషయాలను ప్రకటించింది. అయితే ఇక్కడ మాట్లాడుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి. మూసీని ప్రక్షాళన చేసి పునర్వైభవం తీసుకురావాలన్న విషయంలో ఏ పార్టీకీ రెండో అభిప్రాయం లేదు. అటువంటప్పుడు రాజకీయ విభేదాలు, విమర్శలు, కక్షలు, కార్పణ్యాలు పక్కన పెట్టి మూసీని బాగు చేసే కార్యక్రమాల్లో అన్ని రాజకీయ పక్షాలు కలిసి వస్తే బాగుంటుంది.అఖిలపక్ష సమావేశం నిర్వహించి ప్రతిపక్షాల సలహాలు, సూచనలూ తీసుకోవడానికి, ఇదే అంశం మీద శాసనసభ ప్రత్యేక సమావేశాలు ఎ న్ని రోజులయినా నిర్వహించడానికీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రతిపక్షాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే బా గుంటుంది. నదుల పునరుజ్జీవనం అనేది మన దేశంలో కొత్తేమీ కాదు. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో 43 నదులను పునరుజ్జీవింపచేసి న ఉదంతం మన కళ్ళముందున్నది. దీనివల్ల 5వేల గ్రామాలకు చెందిన 70 లక్షల మంది ప్రజలు లబ్ధి పొందిన విషయం అందరూ గుర్తించాలి.మూసీనది బఫర్ జోన్‌లో, నదీ గర్భంలో ఉన్న నిర్మాణాలు, ఆక్రమణలు తొలగించే క్రమంలో అధికార యంత్రాంగం అత్యుత్సాహానికి పోకుం డా కట్టడి చెయ్యాల్సిన బాధ్యతా ప్రభుత్వానిది. పేద, దిగువ మధ్య తరగతి ప్రజలకు సక్రమరీతిలో పునరావాసం కల్పించే చర్యలకు సరయిన ప్రణాళిక రచించాలి. ముఖ్యమంత్రి ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకుంటేగాని ఇది సాధ్యం కాదని అందరికీ తెలుసు. అయితే ప్రస్తుతం నెలకొన్న రాజకీయ కలుషిత వాతావరణంలో మూసీ కాలుష్యాన్ని తొలగించి పునరుజ్జీవనం సాధించడం అయ్యే పనేనా?కొస మెరుపు: ప్రజలకు మేలు జరిగే క్రమంలో విభేదాలు మరిచి రాజకీయ నాయకులు ఎంత హుందాతనం ప్రదర్శిస్తారో చెప్పడానికి ఇటీవల సీనియర్ పాత్రికేయ మిత్రుడు సాయి శేఖర్ విట్టిలీక్స్ పేరిట గ్రంథస్థం చేసిన తన అనుభవాల్లో రాసిన ఒక సంఘటన గుర్తు చేసుకోవాలి. 1989లో తెలుగుదేశం ఓడిపోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రోజుల్లో జరిగిందీ సంఘటన. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమం త్రి. ఎన్‌టి రామారావు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. ఎన్నికలకు ముందు ఎన్‌టి రామారావు నాయకత్వంలోని ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ఒక ఫైలుకు సంబంధించిన సంఘటన ఇది.

## రెచ్చగొట్టే వారి ఉచ్చులో పడకండి

హైదరాబాద్,బీఆర్ఎస్ అధికారంలో ఉన్న 10 ఏళ్లపాటు ఉద్యోగాలు భర్తీ చేయకుండా కాలయాపన చేసిందని సీఎం రేవంత్ మండిపడ్డారు. ఇప్పుడేమో పోటీ పరీక్షలను వాయిదా వేయాలని అంటోందని అన్నారు. పోలీసు డ్యూటీ మీట్ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఈ నెల 21 నుంచి యథాతథంగా జరుగుతాయని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'పరీక్షలకు సిద్ధం కండి. 95శాతం మంది అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకున్నారు. మరో 5శాతం మంది డౌన్లోడ్ చేసుకోండి. ప్రతిపక్షాల మాయమాటలను నమ్మకండి. వారు చేయరు..ఇప్పుడున్న ప్రభుత్వం చేయకుండా చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. మేం వచ్చాకే వేల ఉద్యోగాలు కల్పిస్తున్నాం' రేవంత్ పేర్కొన్నారు. 'తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశాం. పదేళ్లుగా వాయిదాలు పడుతున్న అన్ని ఉద్యోగాలను భర్తీ చేశాం. 15 వేల మంది పోలీస్ సిబ్బందిని కొత్తగా నియమించాం.1,637 ఇంజినీరింగ్ పోస్టులు, 65 రోజుల్లోనే 11,067 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేశాం. నిరుద్యోగుల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ది పొందాలని కొందరు చూస్తున్నారని, వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. 564 గ్రూప్ వన్ పోస్టుల నియామకాల కోసం మెయిన్స్ పరీక్షను సోమవారం నిర్వహించబోతున్నం. ప్రతిపక్షాల ఉద్యోగాలు పోయాయి. వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయి. గతంలో ఉన్న జీఓ 55 రద్దుచేసి గ్రూప్ వన్ నోటిఫికేషన్ ఇచ్చాం. అదే సమయంలోనే జీఓ 29 తెచ్చాం. ఈ జీవో ద్వారా రిజర్వేషన్లు ఖాళీల భర్తీ విషయంలో ఒక పోస్టు ఖాళీగా ఉన్న 1:50 పిలవాలని నిర్ణయించాం. 31 వేల మందికి పైగా మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఇప్పుడు 1:100 లెక్కన పిలవాలి అని ఆందోళన చేస్తున్నారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనలను మధ్యలో మారిస్తే కోర్టులు ఊరుకుంటాయా అని ప్రశ్నించారు. నోటిఫికేషన్ ఇచ్చే సమయంలోనే 1:100 కోరుకుని ఉంటే మీ ఆలోచనకు తగ్గట్టే ఇచ్చేవాళ్లం అన్నారు. నోటిఫికేషన్లు రద్దయి, యువత రోడ్డుమీద పడితే ఆలోచించే వారిని దూరం పెట్టాలని అన్నారు. రిజర్వేషన్ ప్రకారమే సెలెక్ట్ చేస్తే వేలమంది ఎస్సీ, ఎస్టీలకు అవకాశం వచ్చింది. రిజర్వేషన్లు పకడ్బందీగా అమలు చేస్తుంటే కొంతమంది గందరగోళం సృష్టిస్తూ ఉన్నారు. 10 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు కనీసం మీకు అపాయింట్మెంట్ అయినా ఇచ్చారా..? ప్రజా యుద్ధనౌక గద్దర్ సమస్యలు చెప్పుకోవడానికి వెళ్తే నాలుగు గంటలపాటు ఎండలో నిల్చోబెట్టిన నీచమైన చరిత్ర వాళ్లది. గ్రూప్ 1 హాల్ టికెట్లు 95 శాతం మంది తీసుకున్నారు.. ఇంకా తీసుకొని వారు హాల్ టికెట్లు తీసుకొని పరీక్షకు సన్నద్ధంకండని సిఎం సూచించారు. న్యాయస్థానాలు కూడా ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల విధానాన్ని సమర్థించాయి. మీ భావోద్వేగాలతో బీఆర్ఎస్ ఆడుకుంటోంది. వారి ఉచ్చులో పడకండి. ప్రభుత్వం మీ సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉంది. అన్నగా నేను పరీక్షలు నిర్వహిస్తుంటే, వద్దు అని ఆందోళన చేస్తున్నారు ఆలోచించండి. మీకు అవకాశాలు ఇవ్వడం కోసమే పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఆందోళనలను విరమించి అపోహలకు దూరం కండి. నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నప్పుడు ఉదారంగా వ్యవహరించండి. నిరుద్యోగులపై కేసులు పెట్టాల్సిన అవసరం లేదు.. పొరపాటున కేసులు పెడితే ఉద్యోగాలు సాధించడంలో ప్రతిబంధకంగా మారుతాయి. నిరుద్యోగులు ఆందోళన చేస్తున్న క్రమంలో కేసులు పెట్టవద్దని పోలీసులను ఆదేశిస్తున్నానని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

## జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై ఉపసంఘం చర్చ

న్యూఢిల్లీ, జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం కొన్ని వస్తువులపై జీఎస్టీ తగ్గించాలని నిర్ణయించింది. 20 లీటర్ల ప్యాకేజ్డ్ వాటర్ బాటిల్, సైకిళ్లు, ఎక్సర్‌సైజ్ నోట్‌బుక్స్ వంటి వస్తువులు ఈ జాబితాలో ఉన్నాయి. అదే సమయంలో ఖరీదైన షూస్, చేతి వాచీలపై పన్ను పెంచాలని ప్రతిపాదించనుంది. బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ ఉప సంఘం భేటీలో దీనిపై చర్చ జరిగింది. దీనివల్ల రూ.22వేల కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరనుంది. ప్రస్తుతం 20 లీటర్ల ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బాటిల్‌పై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్నారు. దీన్ని 5 శాతానికి తగ్గించాలని మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. అలాగే రూ.10 వేల్లోపు ధర కలిగిన సైకిళ్లపై 12 శాతం 5 శాతానికి తగ్గించేందుకు ఈ సమావేశంలో నిర్ణయించారు. నోట్ బుక్స్‌పైనా జీఎస్టీని 12 నుంచి ఐదు శాతానికి తగ్గించాలని మంత్రివర్గ ఉప సంఘం ప్రతిపాదించింది. ఈ నిర్ణయాలను జీఎస్టీ కౌన్సిల్ ఆమోదిస్తే ఆ మేర ఊరట కలగనుంది.అలాగే, రూ.15 వేలు కంటే అధిక విలువ కలిగిన షూస్, రూ.25వేల కంటే ఎక్కువ ధర ఉన్న చేతి వాచ్‌లపై జీఎస్టీని 18 నుంచి 28 శాతానికి పెంచాలని ఉప సంఘం ప్రతిపాదించింది. మొత్తం ఈ భేటీలో 100 వస్తువులకు సంబంధించి జీఎస్టీ రేట్లను చర్చించారు. 12 శాతం పన్ను పరిధిలో ఉన్న చాలా వస్తువులపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించారు. దీంతో పాటు 18 శాతం శ్లాబులో ఉన్న హెయిర్ డ్రైయర్లు, హెయిర్ కర్లర్లు, బ్యూటీ, మేకప్ సామగ్రిపై ఉన్న జీఎస్టీని మళ్లీ 28 శాతం శ్లాబులోకి చేర్చాలని మంత్రివర్గ ఉప సంఘం ప్రతిపాదించింది. ప్రస్తుతం జీఎస్టీలో 5, 12, 18, 28 శాతం చొప్పున నాలుగు పన్ను శ్లాబులు ఉన్నాయి. అవసరమైన వస్తువులను తక్కువ శ్లాబులో, లగ్జరీ వస్తువులను ఎక్కువ శ్లాబులో ఉన్నాయి. కొన్ని వస్తువులకు 28 శాతం జీఎస్టీతో పాటు అదనంగా సెస్సు కూడా విధిస్తున్నారు. వివిధ రకాల వస్తువులపై విధిస్తున్న సగటు జీఎస్టీ రేటు 15.3 శాతం దిగువకు చేరిన వేళ.. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరించాలని నిర్ణయించారు. ఇదిలావుంటే పూర్తి స్థాయిలో బీమా కవరేజీ అందించే టర్మ్ పాలసీలతో పాటు, సీనియర్ సిటిజన్ల కోసం తీసుకునే ఆరోగ్య బీమా పాలసీలకు వస్తు, సేవల పన్ను నుంచి ఊరట లభించే అవకాశం ఉంది. సాధారణ పౌరులకు నిర్దేశిత పరిమితి వరకు మినహాయింపు ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఆరోగ్య, సాధారణ బీమా ప్రీమియంలపై జీఎస్టీ విధించే అంశంపై మంత్రివర్గ ఉపసంఘం శనివారం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా టర్మ్, ఆరోగ్య బీమా పాలసీలను మినహాయించాలన్న చర్చ జరిగింది. దీనిపై జీఎస్టీ కౌన్సిల్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. టర్మ్ ఇన్సూరెన్స్‌తో పాటు రూ.5 లక్షల వరకు తీసుకునే ఆరోగ్య బీమాపై జీఎస్టీ నుంచి మినహాయించాలని సమావేశంలో నిర్ణయించారు. రూ.5 లక్షల కవరేజీ దాటితే 18 శాతం జీఎస్టీ విధించనున్నారు. సీనియర్ సిటిజన్లకు మాత్రం కవరేజీతో సంబంధం లేకుండా.. జీఎస్టీ నుంచి మినహాయించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ విషయంలో మంత్రివర్గ సహచరుల నుంచి ఏకాభిప్రాయం వ్యక్తమైందని బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి తెలిపారు. బీమా ప్రీమియంలపై జీఎస్టీ తొలగించాలన్న డిమాండ్ల వేళ గత నెల జీఎస్టీ కౌన్సిల్ సమావేశమైంది.

# వచ్చే నెలలో అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు

తిరుచానూరు,శ్రీవారి పట్టపురాణి శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు వేళయింది. ఏటా కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతాయి. నవంబర్ 28 నుండి డిసెంబర్ 6 వరకు జరిగే శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు తిరుచానూరు ముస్తాబు అవుతోంది. అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టిన టిటిడి పనుల్లో నిమగ్నమైంది. ఈ మేరకు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులతో కలిసి ఏర్పాట్లను టిటిడి జెఈవో వీరబ్రహ్మం పరిశీలించారు. అమ్మవారి ఆలయం, పుష్కరిణి, మాడవీధులు, నవజీవన్ కంటి ఆసుపత్రి సమీపంలోని ఖాళీ స్థలం, ఘంటసాల సర్కిల్, హైస్కూల్ పరిసరాలు, పసుపు మండపం, పూడి రోడ్డు తదితర ప్రాంతాలను జేఈఓ వీరబ్రహ్మం పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు అమ్మవారి మూలమూర్తి దర్శనంతో పాటు వాహన సేవలు వీక్షించేలా టిటిడి లోని అన్ని విభాగాలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన పంచమి తీర్థం లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం పూడి రోడ్డు, రేణిగుంట, మార్కెట్ యార్డ్ ప్రాంతాల్లో స్థలాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా భక్తులు సేదతీరేందుకు నవజీవన్ కంటి ఆసుపత్రి, హైస్కూలు, పూడి రోడ్డులోని గోశాల వద్ద జర్మన్ షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరిణిలోకి వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు తగిన విధంగా గేట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. తమిళనాడు భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు అర్థం అయ్యేలా తమిళ భాషలోనూ సైన్ బోర్డులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు జేఈఓ వీరబ్రహ్మం. ఇక అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భద్రతా పరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకొని పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు టిటిడి సివిఎస్వో శ్రీధర్ తెలిపారు.పంచమి తీర్థం రోజున భక్తులు సేద తీరేందుకు ఏర్పాటు చేసే షెడ్లలో, క్యూలైన్లు, పుష్కరిణి వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా తిరుమల నుంచి పసుపు ఊరేగింపు మార్గాలను ముందే పరిశీలించి ఆ మార్గంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టిటిడి సిఈ సత్యనారాయణ, ఎస్ఈ జగదీశ్వర్ రెడ్డి, ఎస్ఈ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు తో పాటు పలువురు అధికారులు కూడా పర్యవేక్షించారు.

# రాజధాని కలను సాకారం చేస్తున్నాం

అమరావతి,అమరావతిలో రాజధాని నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు పునఃప్రారంభించారు. సీఆర్‌డీఏ ఆఫీసు పనులను ప్రారంభించి ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయుని పాలెం వద్ద పనులు ప్రారంభించారు. భవన ప్రాంగణంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ పూజా కార్యక్రమం నిర్వహించారు. రూ.160 కోట్లతో గతంలో తెదేపా హయాంలో ఏడంతస్తుల్లో సీఆర్‌డీఏ కార్యాలయ పనులు చేపట్టారు. ప్రాజెక్టు కార్యాలయ నిర్మాణాన్ని 2017లో ప్రారంభించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులను నిలిపేశారు. మొత్తం 3.62 ఎకరాల్లో జీ ప్లస్ 7 భవనాన్ని ఇక్కడ ప్రభుత్వం నిర్మిస్తోంది. అదనంగా పార్కింగ్, ల్యాండ్ స్కేపింగ్‌కు 2.51 ఎకరాల విస్తీర్ణం కేటాయించారు. ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్స్, ఇంటీరియర్స్, ఎలక్ట్రిక్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. 'చరిత్రను తిరగ రాసేందుకు మనమంతా ఇక్కడ సమావేశమయ్యాం. రాష్ట్ర విభజన సమయంలో అనేక ఇబ్బందులు పడ్డాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైబరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దిన ఘనత మాదే. ముందుచూపుతో ఆనాడే సైబరాబాద్‌లో 8 వరుసల రోడ్లు వేశాం. శంషాబాద్ విమానాశ్రయానికి 5 వేల ఎకరాలు ఎందుకని అందరూ ప్రశ్నించారు. అభివృద్ధికి అడ్డుపడే వారు ప్రతిచోటా ఉంటారు. అమరావతి రైతులను ఒప్పించి భూమి సేకరించాం. రాజధాని, సమాజ హితం కోసం మీరంతా భూములు ఇచ్చారు. అమరావతి కోసం 54 వేల ఎకరాలు సేకరించాం. మహిళా రైతులు వైకాపా ప్రభుత్వంపై గట్టిగా పోరాడారని అన్నారు. 'రాష్ట్రానిక మధ్యలో ఉండే ప్రాంతం.. అమరావతి. ఒక రాష్ట్రం, ఒక రాజధాని అని.. ప్రతిచోటా చెప్పాను. విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాం. కర్నూలులో హైకోర్టు బెంచ్, పరిశ్రమలను ఏర్పాటు చేస్తాం' అని చంద్రబాబు వెల్లడించారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులను అభినందించిన సీఎం... భూసేకరణ లో మంత్రి నారాయణ చాకచక్యంగా వ్యవహరించారని కొనియాడారు. రాష్ట్ర భవిష్యత్తు బావుంటుందని రైతులు ఇంత పెద్ద ఎత్తున భూమి ఇచ్చారని తెలిపారు. దాదాపు 4300 ఎకరాలు భూ సేకరణ చేశామని... మీరు సమాజహితం కోసం భూమి ఇస్తే గడచిన ప్రభుత్వం అమరావతి రైతాంగంను చాలా బాధపెట్టిందని మండిపడ్డారు. రైతు మహిళలు వీరోచితంగా పోరాడారని.. రాణి రుద్రమ కన్నా వీరోచితంగా పోరాడారని కొనియాడారు. ' మీరు పడిన ఇబ్బందులు నేను చూశాను.. మీ ఉద్యమం కోసం జోలెపట్టి ఆర్థిక సాయం చేశాం. న్యాయస్థానం నుంచి దేవస్థానంకు వెళితే అడ్డుకున్నారు మీరు రోడ్డుపై భోజనం చేశారు. దైవ నిర్ణయం...ఈ భూమి పవిత్రమైనది. ప్రపంచంలోని అన్ని క్షేత్రాల్లో పవిత్ర మట్టి, నీరు తెచ్చాం. ఈ బిల్డింగ్‌ను వెంటనే కాస్త మార్పులు చేర్పులతో 160 కోట్లతో దీన్ని ప్రారంభించాం. నాలుగు నెలల్లో పనులు ప్రారంభిస్తాం అన్నారు. 121 రోజున మరల వచ్చి ఈ భవనాన్ని ప్రారంభిస్తాం. రాష్ట్రానికి నడిబొడ్డున అమరావతి ఎటు చూసినా 12 పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. విశాఖపట్నం, కర్నూలు వెళ్లి అమరావతి ఏకైక రాజధాని అని చెపుతున్న. విశాఖ ఆర్థిక రాజధానిగా, కర్నూలులో హై కోర్టు బెంచ్, పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం. ఇప్పటికీ లీజ్ పీరియడ్ అయిపోయింది అందుకు కొంత సమయం తీసుకున్నాం. రెండో ఇన్‌స్టాల్‌మెంట్ కోసం రైతులకు కౌలుగా రూ. 222 కోట్లు త్వరలో ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యవసాయ కూలీలకు 5000 చొప్పున కూలీ ఇస్తున్నాం'అని వెల్లడించారు.'మన సంకల్పం చాలా గొప్పది.. .హైదారాబాద్ కోసం ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు . అక్కడ సంపద సృష్టించాను. ఔటర్ రింగ్ రోడ్డు ఆధారంగా అక్కడి ప్రభుత్వం వేల కోట్లు సాధిస్తోంది. లక్ష కోట్లు అవుతుంది అని మాట్లాడారు. అమరావతికి డబ్బులు పెట్టక్కర్లేదు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్సింగ్ మోడల్ ఉండే క్యాపిటల్. రాజధాని ప్రారంభించాం మరలా రాష్ట్రమంతా, అమరావతిలోనూ రేట్లు పెరిగాయి. ప్రభుత్వ డబ్బులు ఒక్క రూపాయి అవసరం లేదు. నిన్న బెంగళూర్‌లో ఆయన ఇల్లు మునిగింది.... అమరావతి కాదు. వేరే వాడు చెడిపోవాలి అనుకుంటే మనమే చెడిపోతాం. అమరావతి అనే పేరు సబబు అని రామోజీ రావు సూచించారు. నూటికి నూరు శాతం అమరావతిని ప్రజలు ఆమోదించారు. ఇది దేవతల రాజధాని. ఈ ప్రాంతంలో ఒక్క ఎండ తప్ప అన్ని అనుకూలతలే.

# కక్షసాధింపు కేసులతో మసకబారుతున్న ప్రభ!



న్యూఢిల్లీ,రాజకీయ అవినీతిపై మోడీ తన పదేళ్ల పాలనలో ఒక్క నేతపైనా కేసును రుజువు చేయించలేక పోయారు. కేవలం విచారణలు, జైళ్లు, బెయిలు లాగా కథ నడుస్తోంది. మొన్నటికి మొన్న ఆప్ నేత సత్యేంద్ర జైన్ దాదాపు రెండేళ్ల తరవాత జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. అంతకుముందు సిసోడియా, కేజ్రీవాల్, కవిత, హేమంత్ సోరెన్ వంటి వారు కూడా బెయిల్‌పై వచ్చారు. ఈ అందరిలో ఒక్కరిపైనా కేసులు రుజువు కాలేదు. దీనినిబట్టి ఇడి, సిబిఐల సమర్థతపైనా అనుమానాలు వస్తున్నాయి. అంతేగాకుండా ఇవన్నీ కూడా కేవలం రాజకీయ కక్షసాధింపు కేసలుగానే ప్రజలు ఆలోచిస్తున్నారు. నిజానికి అవినీతి కేసుల్లో నిక్కచ్చిగా వ్యవహరించడడం లేదు. బెయిల్‌పై ఉన్న జగన్ ఎపిని అడ్డగోలుగా ఐదేళ్లు పాలించి, అక్రమాలకు పాల్పడ్డా కేసులు లేకుండా పోయాయి. కెసిఆర్ కుటుంబం అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డా కనీసం ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఇలా నేతల అవినీతిపై ఆరోపణలు చేసింది సాక్షాత్తు ప్రధాని మోడీయే. అయినా అవి విచారణకు నోచుకోలేదు. ఒక్కరు కూడా శిక్షార్హులు కాలేదు. దీనికంతటికీ కేసుల్లో బలం లేకపోవడం లేదా చిత్తశుద్ధి లోపించడం వటంటి కారణాలు కావచ్చు. రాజకీయాల్లో నిజాయితీ ఉండాల్సిందే. అవినీతిని దునుమాడాల్సిందే. నీతిమాలిన పనులు చేయకుండా చూసుకోవాలి. అవినీతికి పాల్పడే నేతలను శిక్షించాల్సిందే. అందుకు ఎవరు కూడా మినహాయింపు కారాదు. కానీ జరుగుతున్న తంతు చూస్తుంటే.. అందుకు భిన్నంగా ఉంది. రామరాజ్యం పేరుతో..ప్రవచనాలు పలికిన ప్రధాని మోడీ తీసుకుంటున్న నిర్ణయాలు మాత్రం పూర్తి పక్షపాతంగా ఉంటున్నాయి. కేజ్రీవాల్, సిసిఓడియా, సత్యేంద్ర జైన్, జార్ఖండ్ సిఎం హేమంత్ సోరేన్ లాంటి వారిని వేటాడి వెంటాడి ఇడి వేధించిన తీరుతో ఒరిగిందేమీ లేదు. కేసుల్లో బలం లేకపోవడం, రుజవులు సంపాదించకపోవడం, కేవలం వేధింపు చర్యగానే చూడాలి. అలాగే తెలుగు రాష్ట్రాల్లో అవినీతి ముఖ్యమంత్రులుగా రాజ్యమేలిన కెసిఆర్, జగన్‌లను మాత్రం ఏమీ చేయలేకపోయారు. ఇక్కడ వీరిని ట్రంప్ కార్డుల్లా వాడుకున్నారు. రేపు ఏ అవసరం వస్తుందో అన్న భయంలో కాపాడుకుంటూ వచ్చారు. అయితే అవినీతి, అహంకారానికి పాల్పడిన కెసిఆర్ కుటుంబంపై రంకెలు వేసిన ప్రధాని మోడీ ఆయనపైనా, కూతురు కవితపైనా ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు. కవితను అరెస్ట్ చేసి జైలులో పెట్టినా కేసు నిలబడలేదు. దీంతో ప్రజలే తీర్పును ఇచ్చారు. అందుకే ప్రజలు తీర్పు ఇచ్చి అవినీతికి పాల్పడ్డ కెసిఆర్, జగన్‌లను అధికారానికి దూరం చేశారు. ఐదేళ్లపాటు ఎపిలో జగన్ బెయిల్‌పై ఉన్నా మోడీ పట్టించుకోలేదు. కేసులు ఏవీ ఆయనను ఏమీ చేయలేదు. ఇదంతా మోడీ ప్రాపకం వల్లనే అని చెప్పాల్సిన అవసరం లేదు. కానీ జార్ఖండ్‌లో మాత్రం అలా జరగలేదు. మోడీ ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలకు జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ ప్రభుత్వం బలైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి)ని ప్రయోగించి ఏకంగా ముఖ్యమంత్రినే అరెస్టు చేయించింది. ఢిల్లీ, జార్ఖండ్‌లలో సిఎంలను అరెస్ట్ చేయించి మోడీ చరిత్ర సృష్టించారు. ఈడీ చర్యల కారణంగా దానికి ఉన్న ప్రతిష్ట దిగజారింది. సిబిఐ ప్రతిష్టా దిగజారింది. ఈ రెండు సంస్థలు దర్యాప్తులో పెద్దగా పురోగతి సాధించలేక పోతున్నాయి. ఎపిలో వైఎస్ వివేకనందరెడ్డి హత్య కేసును ఛేదించలేక పోయారు. ఈడీ అధికారుల చర్యల కారణంగా తాము, తమ కుటుంబం బాధపడ్డామనీ, తీవ్రమైన మనో వేదనను ఎదుర్కొన్నామనీ కేసులు ఎదుర్కొన్న నేతలు వ్యాఖ్యానించారు. ఇకపోతే కెసిఆర్, జగన్‌లకు లేని వేధింపులు జార్ఖండ్‌లో సోరేన్‌కు మాత్రమతప్పలేదు. ప్రజలు ఇలాంటి దర్యాప్తులపై ఆలోచించాలి. గతంలో అసోం సిఎం హిమంత్ బిశ్వశర్మ కూడా ఇలాగే ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బిజెపిలో చేరాక అవినీతి కేసులు మాయమయ్యాయి. తాజాగా సిబిఐ, ఈడీ, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకత వస్తోంది. . నిజానికి కుంభకో ణాలకు, అవినీతికి పాల్పడ్డ వారు ఎంతటి వారైనా శిక్షకు గురి కావాల్సిందే. కానీ కొందరిని మాత్రమే టార్గెట్ కావడం...కేవలం ఎన్‌డిఎ గూటిలో లేని వారికే వేధింపులు రావడం గమనించవచ్చు. రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల నేతలు చేస్తున్న అవినీతిపై చర్యలు తీసుకోవాల్సిందే. అప్పులకుప్పగా చేసి,దివాళా తీయించిన తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్ విషయంలో మోడీ ప్రేమ చూపడం సరికాదు. ఢిల్లీ మద్యం స్కామ్‌లో ఉన్న వారినెవరినీ వదలబోమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణలో జరిగిన ఎన్నికల సభల్లో ప్రకటించారు. లిక్కర్ స్కాంలో ఫోన్లు మార్చి డబ్బు తీసుకున్న బీఆర్ఎస్ నేతలు కూడా జైలుకు వెళ్లే సమయం తప్పకుండా వస్తుందని హెచ్చరించినా చర్యలు మాత్రం తీసుకోలేదు. ఎందుకంటే కవిత జైలుకు వెళ్లడం, బెయిల్‌పై రావడం తప్ప దర్యాప్తులో పురోగతి లేదు. ఈ దేశంలో ఎవరైనా నేరం చేస్తే శిక్ష పడేలా చేసే హక్కు న్యాయస్థానాలకే కాని ప్రభుత్వాలకు ఉండదు. ఢిల్లీ మద్యం స్కామ్ ఇప్పటికే సుప్రీంకోర్టు విచారణలో ఉన్నది. మనీలాండరింగ్ చట్టాన్ని నిర్విచక్షణగా అమలు చేయడం పట్ల సుప్రీంకోర్టు ఇప్పటికే అనేక అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అయినప్పటికీ ప్రధానమంత్రి స్వయంగా తాను రాజకీయ ప్రత్యర్థులను శిక్షిస్తానని బహిరంగ సభల్లో ప్రకటించారు. అవినీతిపరులను జైలుకు పంపిస్తామని ప్రకటించిన మోదీ ప్రాజెక్టుల్లో అవినీతి, నిరుద్యోగం, ధరణి పేరిట అక్రమాలు, ఫామ్ హౌజ్‌లో విశ్రమించడం, మూఢ నమ్మకాలు వంటి అనేక అంశాలను తెలంగాణలో నాటి సిఎం కెసిఆర్ విషయంలో ప్రస్తావించారు. కానీ ఒక్కటంటే ఒక్క చర్య తీసుకోలేదు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనన్న ప్రచారం ఇప్పటికీ సాగుతోంది. ఇలా రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేయడం సరికాదు. ఇప్పటికైనా సిబిఐ,ఇడిలను పటిష్టం చేయాలి. రాజకీయాలకు దూరంగా స్వతంత్రంగా అవి పనిచేసుకునేలా చేయాలి. అప్పుడే అవినీతి నేతలకు వణుకు పుడుతుంది.

# మహారాష్ట్రలో కీలక సమర సంకేతాలు!

మహారాష్ట్ర,నవంబరు 20వ తేదీన మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల కమిషన్ ప్రకటించడానికి ముందే భారత దేశ ఆర్థిక రాజధాని రాజకీయ మంత్రాంగంతో అట్టుడికిపోతున్నది. బి.జె.పి, ఎన్.డి.ఎ కూటమిని దారుణంగా దెబ్బ తీసిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఒకవైపు, తాజాగా జరిగిన హర్యానా ఎన్నికలలో ఊహలకు భిన్నంగా బి.జె.పి పెద్ద విజయం సాధించడం మరోవైపు ఇందుకు కారణమైనాయి. ఇది రాస్తున్న సమయానికి కూడా మహారాష్ట్రలో 'ఇండియా' వేదిక ప్రతిరూపమైన మహా వికాస్ అగాధీ (ఎం.వి.ఎ) సీట్ల సర్దుబాట్లు ఒక కొలిక్కి వచ్చినట్టు కనిపించదు. మూడు ప్రధాన భాగస్వామ్య పార్టీలైన శివసేన (ఉద్ధవ్ వర్గం), ఎన్.సి.పి, కాంగ్రెస్‌లు స్పష్టంగా సర్దుబాటు చేసుకోలేకపోవడం ఒకటైతే మిగిలిన భాగస్వామ్య పార్టీలు వామపక్షాలు ఇతర ప్రాంతీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకోకపోవడం మరో సవాలుగా తయారైంది. నిజానికి కాంగ్రెస్, శివసేనలే పరస్పర విరుద్ధమైన రకరకాల ప్రకటనలతో రచ్చకెక్కడం చూస్తున్నాం. బి.జె.పి, శివసేన (ఏక్‌నాథ్ షిండే వర్గం), ఎన్.సి.పి (అజిత్ పవార్) కూటమి కూడా మల్లగుల్లాలు పడుతున్నది. ఏమైనా రెండు కూటముల నేతలకూ కలిసి వెళ్లడం తప్పదని తెలుసు గనక పరిశీలకులు కలిపే చూస్తున్న పరిస్థితి. హర్యానాలో కాంగ్రెస్ అతి అంచనాలతో దెబ్బతిన్న తర్వాత శివసేన కొంచెం బెట్టు పెంచగా అటు మహాయుతిలో బి.జె.పి షరతులు బిగించడం సహజంగానే జరిగింది. ముఖ్యమంత్రి ఎవరో ఎన్నికల తర్వాతనే చెబుతామని ఇరు కూటములు కూడా దాటేస్తున్నా ఎంతో కొంత ఉద్ధవ్ ధాకరే, షిండేలే వుంటారన్న సంకేతాలు కూడా వెలువరించడానికి సిద్ధపడుతున్నాయి. ఒంటరిగా పోటీ చేయడం నష్టదాయకమన్న భయమే ఇందుకు దారి తీస్తున్నది కానీ అదే సమయంలో అధికార ప్రతినిధులు, రాష్ట్ర నాయకులు మాత్రం తీవ్ర భాషలోనే వివాదపడుతున్నారు.

### లోక్‌సభ ఫలితాల సంచలనం

లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర ప్రదేశ్ తర్వాత మహారాష్ట్ర ఫలితాలే 'ఇండియా'కు ఊపునిచ్చాయి. యు.పి లో 2019 ఎన్నికల కన్నా 2024లో 'ఇండియా' వేదికకు 37 స్థానాలు అధికంగా మొత్తం 43 వచ్చాయి. మహారాష్ట్రలోని 48 సీట్లలోనూ 'ఇండియా' భాగస్వాములకు 2019లో కంటే 25 స్థానాలకు పెరిగి మొత్తం 30 స్థానాలు దక్కాయి. వీటి వల్లనే లోక్‌సభ ముఖచిత్రం మారింది. ఈ 25 మాత్రమే గాక కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థి ఒకరు నెగ్గారు. బి.జె.పి, ఎన్.డి.ఎ లకు చెందిన ముగ్గురు మంత్రులు, 25 మంది ఎంపీలు ఓడిపోయారు. సీట్లలో ఇంత తేడా వున్నా ఓట్ల శాతం మాత్రం పోటాపోటీగానే వుండటం విస్మరించరానిది. 'ఇండియా' ఎం.వి.ఎ పార్టీలకు 44 శాతం ఓట్లు వస్తే ఎన్.డి.ఎ, మహాయుతికి 43.6 శాతం వచ్చాయి. అంటే తేడా కేవలం 0.4 శాతం మాత్రమే! ఎన్నికలకు ముందు ఎం.వి.ఎ చాలా సమస్యలను ఎదుర్కొన్నది. బి.జె.పి ఒత్తిడి కారణంగా కావచ్చు ఎన్నికల సంఘం శివసేన, ఎన్.సి.పి పార్టీల అధికారిక గుర్తులను పోటీ వర్గాలకే కేటాయించింది. ఉద్ధవ్, పవార్ పార్టీలు కొత్త గుర్తులతో పాల్గొన్నాయి. దేశ ఆర్థిక రాజధానిగా వుండటంతో కార్పొరేట్ మద్దతు మాత్రమే గాక మీడియా ప్రచారం కూడా ఎన్.డి.ఎ కే విస్తారంగా లభించింది. అయినా సరే షిండే ప్రభుత్వ అవినీతి, నిరంకుశ పోకడలపై తీవ్ర వ్యతిరేకత, సమస్యల కారణంగానే ప్రజలు ప్రతిపక్ష కూటమిని బలపర్చారు. వాస్తవానికి వందమంది సేన, ఎన్.సి.పి సభ్యులు షిండేను బలపర్చడం వెనక కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ఒత్తిళ్లు, బెదిరింపులు, వేధింపులు, కుట్రలు కీలక పాత్ర వహించాయి. మాతృ సంస్థలకు వెన్నుపోటు పొడిచి వీరంతా అటు చేరారనే ఆగ్రహంతో ప్రజలు ఎం.వి.ఎ కు సానుభూతి చూపించారు. ప్రజల నిరసనకు రాజకీయ చక్రధారి శరద్ పవార్, మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ధాకరే. కాంగ్రెస్ అధ్యక్షుడు



నానా పటోల్ నాయకులుగా ఆదరణ పొందారు. ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, యు.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వంటి బి.జె.పి నేతలు మతపరమైన విభజన కోసం అనేక పథకాలు వేసినా రకరకాల రిజర్వేషన్ల సమస్యలను తీసుకొచ్చినా జీవనోపాధి సమస్యలు, ఆర్థికాంశాలపై కేంద్రీకరించిన ఎం.వి.ఎ వైపే ఓటర్లు మొగ్గు చూపారు. మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ముస్లిం మైనార్టీలు, ఇతరులు కూడా ఎం.వి.ఎ ను బలపర్చారు. 'వంచిత్ బహుజన్ అగాధీ' (వి.బి.ఎ), మజ్లిస్ వంటి పార్టీల విచ్ఛిన్నకర పాత్రను కూడా తోసిపుచ్చారు. మహారాష్ట్రకు సంబంధించిన పరిశ్రమలు, ప్రాజెక్టులు గుజరాత్‌కు తరలించే ధోరణి కూడా విముఖతకు కారణమైంది. బడా మీడియా బి.జె.పి తరపునే పనిచేసినా ప్రజాసంఘాలు, మీడియా వేదికలు వినూత్న నినాదాలతో పట్టుదలగా పోరాడటం మరింత దోహదం చేసింది. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలనే స్ఫూర్తి ప్రతిబింబించింది.

### హర్యానా అనంతరం

ఈ నేపథ్యంలో ఎం.వి.ఎ పార్టీలు మరింత అప్రమత్తంగా, ఐకమత్యంగా వ్యవహరించితేనే లోక్‌సభ ఫలితాల ప్రభావాన్ని కొనసాగించడం శాసనసభలో విజయం సాధించడం అవసరమనే భావన అందరిలోనూ వ్యక్తమైంది. హర్యానా ఫలితాల తర్వాత కాంగ్రెస్ అక్కడ అనుసరించిన వైఖరిపై భాగస్వామ్య పార్టీల నుంచి వచ్చిన విమర్శల ప్రభావం మహారాష్ట్ర పైనే ఎక్కువగా పడింది. నిజానికి ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలు ఒకసారి జరపడానికి బి.జె.పి జంకింది గనకే నవంబర్‌కు వాయిదా పడ్డాయి. అయితే అనుకోని విధంగా అక్కడ బి.జె.పి మూడోసారి విజయం సాధించడంతో మహారాష్ట్ర రాజకీయంపైనా ప్రభావం పడింది. ఎం.వి.ఎ లోని మూడు పార్టీల సంప్రదింపులలో పలు విభేదాలు తొంగిచూశాయి. ఒకవైపున అత్యధిక స్థానాలలో అవగాహన కుదిరిందని అంటున్నా విదర్భ, ముంబాయి సీట్లలో తీవ్రంగానే తేడాలు కొనసాగాయి. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోల్‌తో చర్చలు జరిపే ప్రసక్తి లేదని సంజరు రౌత్‌తో సహా హెచ్చరికలు చేశారు. ఆయన మాట్లాడే తీరుపై విమర్శలే గాక నిర్ణయాధికారం లేనివారితో చర్చలు ఎందుకని ఉద్ధవ్ కూడా ప్రశ్నించారు. సీట్ల చర్చలలో విభేదాలు సహజమే గానీ ఈ కారణంగానే తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నట్టు వ్యాఖ్యానించారు. ఒకటి రెండు రోజులు పడితే గానీ ఎంవిఎ లోని మూడు పార్టీల మధ్య సంప్రదింపులు ముగిసేట్టు కనిపించడంలేదు. మొత్తంపైన 260 సీట్ల వరకూ అవగాహనకు రాగలిగామని మరో పాతిక ముప్పై సీట్లలో ఎవరు పోటీ చేయాలనే దానిపై తుది నిర్ణయం జరగాలని వారంటున్నారు. అన్నిటినీ ఢిల్లీకి తెప్పించి ఆలస్యంగా నిర్ణయాలు చేసే రి వాజును కాంగ్రెస్ మార్చుకోవాలని శివసేన నేతలు అంటుంటే కాంగ్రెస్ పరిశీలకుడుగా వచ్చిన రమేష్ చెన్నితల అంతా అయిపోతుందని భరోసా ఇస్తున్నారు. 115 స్థానాల్లో కాంగ్రెస్, 80-90 మధ్య సేన, 70 సీట్లకు పైన ఎన్.సి.పి పోటీ చేస్తాయని సూచనలున్నాయి.

# విద్యుత్ ఛార్జీల నియంత్రణ ఏదీ

అమరావతి, విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం, విద్యుత్ బిల్లుల భారం తగిస్తాం అని ఉమ్మడి మేనిఫెస్టో (ఆరవ పేజీలో) హామీనిచ్చి అధికారానికి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోవాలి. సర్దుబాటు చార్జీలు విద్యుత్ వాడకానికి సంబంధించినవే. అంతకన్నా ముఖ్యంగా రెండున్నరేళ్ల క్రితం వాడిన కరెంటుకు ఇప్పుడు చెల్లించాలనడం దారుణం. కూటమి సర్కారు చార్జీలను నియంత్రించడం కాదు సరికదా మరింత విశృంఖలం గావిస్తున్నది. బిల్లుల భారం తగ్గించడం గాక పెనుభారం మోపుతోంది. ఏలినవారు విజ్ఞతతో యోచించి ప్రతిపాదిత 'సర్దుపోటు'ను ఉపసంహరించడం అందరికీ శ్రేయస్కరం! సర్దుబాటు చార్జీల మూలంగా యూనిట్‌కు రూ.1.27 మాత్రమే భారం పడుతుందని డిస్కాముల వివరణ పత్రం పేర్కొన్నది. రాష్ట్ర వ్యాప్త విద్యుత్ వినియోగం, సర్దుబాటు చార్జీ సగటు లెక్కించి ఆ మొత్తం తేల్చేశారు. కానీ వాస్తవానికి సర్దుబాటు చార్జీలను ఆయా త్రైమాసికాలనుబట్టి, ఆయా డిస్కాములు ఎంత చొప్పున వసూలు చేయవచ్చునో ఇ.ఆర్.సి నిర్ణయిస్తుంది. ఆ ప్రకారం అది ఒక్కో డిస్కాముకు ఒక్కో త్రైమాసికానికి యూనిట్‌కు ఒక్కో విధంగా ఉంటుంది. ఈ మాత్రం లాజిక్ కూడా లేకుండా ప్రజలను మభ్యపుచ్చేందుకు ప్రభుత్వ రంగంలోని డిస్కాములు యత్నించడం దారుణం. అంతేగాక ఇది పేదలకు పెనుభారం. ప్రస్తుతం వున్న టారిఫ్ ప్రకారం రోజుకు ఒక్క యూనిట్ మించకుండా (నెలకు 30 యూనిట్లు) వాడే నిరుపేదలు ఒక్కో యూనిట్‌కు ఇంధన చార్జీగా రూ.1.90, అదే నెలకు 400 యూనిట్లకు పైబడి వాడే సంపన్నులు యూనిట్‌కు రూ. 9.75 చొప్పున చెల్లించాలి. డిస్కాముల వివరణలో పేర్కొన్న సర్దుబాటు రూ.1.27 మాత్రమే అనుకున్నా నిరుపేదల ఇంధన చార్జీకి అదనంగా 67 శాతం చెల్లించాలి. అదే సంపన్నులకు మాత్రం అది 13 శాతమే! మొత్తం విద్యుత్ సంస్కరణల మాటున జరిగేవి ఇలాంటి మాయాజాలాలను ప్రజలు గుర్తించాలి. 11 వేల కోట్లకు పైగా సర్దుబాటు చార్జీ కూడా ఈ వరుసలోనే ఉందని వార్తలొచ్చాయి. అంటే మొత్తం దాదాపు 20 వేల కోట్ల రూపాయలు చెల్లించాలన్నమాట. ఇప్పటికే అధిక ధరలు, తరుగుతున్న ఆదాయాలతో సతమతమవుతున్న ప్రజానీకం పులి మీద పుట్రలా పడిన విద్యుత్ భారాన్ని ఎలా చెల్లించగలం అని ఆందోళన చెందుతున్నారు. జనం గందరగోళ పడుతుండగా ఈ సర్దుబాటు చార్జీలకు ఇప్పటి ప్రభుత్వానికి సంబంధం లేదని డిస్కాములు అక్టోబర్ 1న సుదీర్ఘ వివరణ ఇచ్చాయి. ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ వంటి పేరుతో ఎప్పుడో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు చార్జీ వసూలు చేయడమేమిటి? వాటిని రద్దు చేయండి' అని ప్రజలు చాలా ఏళ్లుగా ఆందోళన చేస్తున్నా పాలకులు వెనక్కు తగ్గడంలేదు. రాష్ట్రంలో ఎవరు అధికారంలోవున్నా ఈ విషయంలో మాత్రం మార్పు లేదు. సర్దుబాటు చార్జీలను నిర్ణయించి, ఆ మొత్తాన్ని వినియోగదార్ల నుండి ఎప్పుడు ఎన్ని వాయిదాల్లో వసూలు చేయాలో ఇఆర్‌సి ఉత్తర్వులిస్తుంది. కాబట్టి ఈ మొత్తం ప్రక్రియ ఒక త్రైమాసికం పూర్తయిన వెంటనే నిర్దిష్ట గడువులోగా పూర్తి కావాలి. అధికారం ఏ పార్టీ చేతిలోవున్నా విద్యుత్ భారాలు, ఆ విధానాలూ అలాగే కొనసాగుతున్నాయి!ఒప్పందాలు కుదుర్చుకున్న ప్లాంట్ల నుండి రాష్ట్రంలో డిమాండ్‌కు తగినంత విద్యుత్ సరఫరా కావడం లేదంటూ ఓపెన్ మార్కెట్‌లో అధిక ధరకు పవర్ ఎక్స్ఛేంజి నుండి డిస్కాములు భారీగా కొనుగోలు చేశాయి. ఇవన్నీ ఆనాటి ప్రభుత్వ పెద్దల ఆదేశానుసారమే జరిగాయన్న విషయం మరువరాదు.

# తీరు మార్చుకోని కెనడా ప్రభుత్వం

న్యూఢిల్లీ,భారత్‌తో దౌత్యసంబంధాలు తీవ్రస్థాయిలో దెబ్బతింటున్నా కెనడా వైఖరిలో మాత్రం ఎలాంటి మార్పులేదు. ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో మాటల్నే విదేశాంగమంత్రి మెలానీ జోలీ వల్లెవేశారు. అక్కడున్న మిగిలిన దౌత్యవేత్తలపై నిఘా ఉంచామంటూ భారత్‌పై బురదజల్లే ప్రక్రియను కొనసాగించారు. అంతటితో ఆగకుండా భారత్‌ను రష్యాతో పోలుస్తూ అక్కసు వెళ్లగక్కారు. వియన్నా కన్వెన్షన్ ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడితే సహించేది లేదని మెలానీ వ్యాఖ్యలు చేశారు. సిక్కుల అతివాద నేత హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకేసు అనుమానితుల జాబితాలో ఏకంగా భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మను చేర్చింది. ఈ పరిణామం రెండు దేశాల మధ్య అగ్గిరాజేసింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన్ని, మరికొందరు అధికారుల్ని అక్కడి నుంచి వెనక్కి తెచ్చేయాలని కేంద్రం నిర్ణయించింది. దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించింది. ప్రతిగా కెనడా సైతం అదే తరహా నిర్ణయం తీసుకుంది. ఇలా ఉద్రిక్తతలు కొనసాగుతోన్న తరుణంలో మెలానీ మాట్లాడుతూ రష్యా, భారత్ మధ్య పోలిక తెచ్చారు. 'మా దేశ చరిత్రలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. అంతర్జాతీయ శక్తులు కెనడా గడ్డపై ఇలాంటి అణచివేతకు పాల్పడటాన్ని మేం జరగనివ్వబోం. ఐరోపాలో ఇలాంటివి మేం చూశాం. జర్మనీ, యూకేలో రష్యా ఆ పనిచేసింది. ఇలాంటివాటికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడాల్సి ఉంది' అని జోలీ వెల్లడించారు. కెనడాలో మిగిలిన భారత దౌత్యవేత్తలను కూడా బహిష్కరిస్తారా ? అని అడగ్గా.. 'వారిపై నిఘా ఉంచాం. ఒట్టవా హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తలను బహిష్కరించాం. మిగిలినవారు వాంకోవర్, టొరంటోలో ఉన్నారు. వియన్నా కన్వెన్షన్‌కు విరుద్ధంగా వ్యవహరించే దౌత్యవేత్తలను మేం సహించబోం' అంటూ వ్యాఖ్యలు చేశారు. నిజ్జర్ హత్యకేసులో భారత్ ఏజెంట్ల ప్రమేయం ఉందంటూ గతేడాది ట్రూడో చేసినప్పటినుంచి రెండు దేశాల సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే కేవలం నిఘా సమాచారం ఆధారంగా అప్పుడు భారత్‌పై ఆరోపణలు చేశానని, ఆ సమయంలో ఎటువంటి ఆధారాలు లేవని ట్రూడో ఇటీవల అంగీకరించిన సంగతి తెలిసిందే. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. భారత్‌పై నిందలు వేస్తున్న విషయం ఆయన మాటల్లోనే తేటతెల్లమైందని మండిపడింది. అయినా కూడా ట్రూడో తన వ్యాఖ్యలను కొనసాగించారు. కెనడియన్లకు సంబంధించిన సమాచారాన్ని భారత దౌత్యవేత్తలు సేకరించారని, వాటిని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు అందజేశారని మరోసారి ఆరోపించారు.

### చెరువులోకి దూసుకెళ్లిన డ్రైవింగ్ కారు

జనగామ,ఓ వ్యక్తి డ్రైవింగ్ నేర్చుకుంటుండగా కారు చెరువులోకి దూసుకెళ్లింది. డ్రైవింగ్ నేర్చుకుంటున్న వ్యక్తి, నేర్పుతున్న వ్యక్తి ఇద్దరూ కారులోనే చిక్కుకుపోయారు. స్థానికులు గమనించి వారికి సాయం చేయడంతో ఇద్దరూ సురక్షితంగా ఈదుకుంటూ బయటికి వచ్చారు. జనగామ పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. జనగామలోని బతుకమ్మ కుంట పక్కన ఉన్న గ్రౌండ్‌లో ఓ వ్యక్తి మరో వ్యక్తికి కారు డ్రైవింగ్ నేర్పుతున్నాడు. ఈ క్రమంలో అయోమయానికి గురైన ట్రెయినీ డ్రైవర్ కారు బ్రేక్‌కు బదులుగా యాక్సిలేటర్ తొక్కాడు. దాంతో కారు చెరువులోకి దూసుకెళ్లింది. ఇది గమనించిన స్థానికులు డోర్ లాక్ తీసి ఈదుకుంటూ రండి అని సూచించగా లాక్ రాలేదు. దాంతో విండోలోంచి దూకి ఈదుకుంటూ ఒడ్డుకు చేరారు. కారు ఇంకాస్త లోపలికి వెళ్లి ఉంటే ఇద్దరి ప్రాణాలు పోయేవి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# గ్రేటర్ పై బీజేపీ గురి.. చంద్రబాబు, అమిత్‌షా భేటీలో చర్చ!



హైదరాబాద్,తెలంగాణలో భారతీయ జనతా పార్టీ మరింత బలపడేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో బీజేపీకి స్థానాలు దక్కకపోయినా.. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో మంచి ఫలితాలనే రాబట్టింది. ఎనిమిది నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడంతో.. తెలంగాణలో బలమైన పార్టీగా ఎదుగుతున్నట్లు బీజేపీ చాటింది. తాజాగా కాంగ్రెస్ పార్టీపై బీజేపీ దూకుడుగా ముందుకెళు న్నది. ప్రధాన ప్రతిపక్షం తరహాలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ అధికార పార్టీకి సవాళ్లు విసురుతోంది. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలపై బీజేపీ గురి పెట్టింది. వచ్చే ఏడాది జరిగే గ్రేటర్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలని ఆ పార్టీ నేతలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏపీలో ఎన్డీయే కూటమిలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉన్నాయి. తెలంగాణలోనూ తెలుగుదేశం, జనసేన పార్టీలను కలుపుకొని గ్రేటర్ ఎన్నికల్లో పోటీ చేయాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు. ముఖ్యంగా తెలుగుదేశం లాంటి బలమైన పార్టీ అండదండలు ఉంటే గ్రేటర్‌లో విజయం నల్లేరుపై బండి నడకే అవుతుందని బీజేపీ అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.గత పదేళ్లుగా గ్రేటర్ హైదరాబాద్ లో బీఆర్ఎస్ హవా కొనసాగుతూ వచ్చింది. రాజకీయంగా బీఆర్ఎస్ బలంగా ఉన్నప్పుడు కేసీఆర్ ఏ గేమ్ ఆడితే అదే హైదరాబాద్ లో కీలకంగా మారేది. కానీ, ఇప్పుడు కథ మారింది. బీఆర్ఎస్ క్రమంగా తన ప్రాబల్యాన్ని కోల్పోతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో గ్రేటర్ లోని పలువురు నేతలు పార్టీని వీడారు. గ్రేటర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విజయం సాధించారు. అయితే, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని మరోసారి నిలబెట్టుకోలేక పోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రేటర్ పై ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో బీఆర్ఎస్ కి చెందిన పలువురు ఎమ్మెల్యేలతో పాటు గ్రేటర్ మేయర్, డిప్యూటీ మేయర్ సహా పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ లో చేరారు. దీంతో గ్రేటర్ లో కాంగ్రెస్ పార్టీ బలోపేతమైంది. గ్రేటర్ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ లోని కీలక నేతలు ఆ పార్టీని వీడే అవకాశాలు కనిపిస్తున్నాయి.దీంతో ఈసారి గ్రేటర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో స్థానానికి పడిపోతుందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వినపడుతోంది. మరో వైపు కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ, హైడ్రా పేరుతో హడలెత్తిస్తోంది. ముఖ్యంగా నగరంలో చెరువులు, నాళాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. ఈ పరిణామం నగర వాసుల్లో ఆందోళన కలిగిస్తోంది. మరో ఏడాదిలో గ్రేటర్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాకు, మూసీ సుందరీకరణకు ఎందుకు ప్రాధాన్యతనిస్తున్నారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. గ్రేటర్ పరిధిలోని పలువురు కాంగ్రెస్ నేతలు సైతం ప్రభుత్వ తీరును తప్పుపడుతున్నారు. మరో వైపు ప్రభుత్వ తీరుపై గ్రేటర్ వాసుల్లోనూ వ్యతిరేకత పెరుగుతోంది. ఈ పరిణామాలను తమకు అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ రంగం సిద్ధం చేసుకుంటున్నది. గ్రేటర్ పరిధిలో ఎక్కువగా సెటిలర్స్ ఉన్నారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారు ఎన్నోఏళ్లుగా హైదరాబాద్ నగరంలో స్థిరపడిపోయారు. వీరంతా ఎక్కువ శాతం తెలుగుదేశం మద్దతుదారులు. రాష్ట్ర విభజన తరువాత తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పెదగా క్రీయాశీలంగా లేకపోవటంతో గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం శ్రేణులు, సానుభూతిపరులు బీఆర్ఎస్, కాంగ్రెస్ లకు మద్దతుగా నిలుస్తూ వస్తున్నారు.ఇప్పుడు గ్రేటర్ పరిధిలోని తెలుగుదేశం సానుభూతిపరులను తమవైపుకు తిప్పుకొనేలా బీజేపీ ప్లాన్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.వచ్చే ఏడాది జరిగే గ్రేటర్ ఎన్నికల్లోనూ మూడు పార్టీలూ కలిసి పోటీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఈ విషయాన్ని బీజేపీ పెద్దలు టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా.. చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో తెలుగుదేశం పోటీకి దూరంగా ఉంది. బీజేపీతో పొత్తు ఉంటుందని, ఖమ్మం, హైదరాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ తోపాటు పలు జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు బరిలోకి దిగుతారని ప్రచారం జరిగింది. కానీ, తెలంగాణ బీజేపీలోని కొందరు నేతలు తెలుగుదేశంతో పొత్తుకు అభ్యంతరం చెప్పడంతో బీజేపీ ఒంటరిగా ఎన్నికలకు వెళ్లింది. తెలుగుదేశం పోటీకి దూరంగా ఉంది. దీంతో తెలుగుదేశం సానుభూతిపరులు అధికశాతం మంది రేవంత్ రెడ్డి నాయకత్వం వహించిన కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచారు. మరో ఏడాది తరువాత జరగబోయే గ్రేటర్ ఎన్నికల్లోనూ టీడీపీ పోటీలో లేకుంటే ఆ పార్టీ మద్దతుదారులు కాంగ్రెస్ కే మద్దతుగా నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన తప్పుచేయకుండా, తెలుగుదేశంతో కలిసి పోటీ చేస్తేనే బాగుంటుందని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు. తెలుగుదేశంతోపాటు జనసేనని కూడా కలుపుకొని గ్రేటర్ ఎన్నికలకు వెళితే మేయర్ పీఠాన్ని దక్కించుకోవటం సాధ్యమవుతుందని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. అయితే, ఎన్నికలకు మరో ఏడాదిన్నర సమయం ఉండటంతో ఆ సమయానికి రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు ఏ విధంగా మారుతోయో వేచి చూడాల్సిందే.

# 2027లోనే జమిలి ఎన్నికలు.. సిద్ధమవుతున్న కేంద్ర ప్రభుత్వం!

న్యూఢిల్లీ,దేశంలో వన్ నేషన్- వన్ ఎలక్షన్ ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే 2027లో భారత్‌లో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జమిలీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరింత సమాచారం కోసం ఈ స్టోరీ చదవండి.దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని గత కొంతకాలంగా బీజేపీ చెబుతోన్న సంగతి తెలిసిందే. ఇటీల కేంద్ర కేబినెట్ కూడా వన్ నేషన్-వన్ ఎలక్షన్ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ప్రకటించారు. వచ్చే శీతాకాలం పార్లమెంటులో కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టే ఛాన్స్ ఉందనే వార్తలు కూడా వచ్చాయి. అయితే దీనికి సంబంధించి తాజాగా మరో కీలక విషయం బయటపడింది. 2027లో భారత్‌లో మొత్తం ఒకేసారి ఫిబ్రవరిలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జమిలీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

5 ఆర్టికల్స్ సవరణ చేయాలి

జమిలీ ఎన్నికల సాధ్యాసాధ్యాలపై గతంలోనే మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ కూడా పూర్తిస్థాయిలో పరిశీలన జరిపింది. తాను రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి కూడా అందజేసింది. అయితే దేశవ్యాప్తంగా జమిలీ ఎన్నికలు జరగాలంటే రాజ్యాంగంలోని 5 ఆర్టికల్స్ సవరణ చేయాలని ఈ కమిటీ తెలిపింది. ఆర్టికల్ 83,85,172,174,356లను బిల్లు ద్వారా సవరణ చేయాలని సూచనలు చేసింది.

67 శాతం సభ్యుల మద్ధతు అవసరం

అయితే ఈ బిల్లు ఆమోదం పొందాలంటే కొన్ని పరిణామాలు జరగాల్సి ఉ ంటుంది. జమిలీ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ కావాలంటే.. లోక్‌సభ, రాజ్యసభలో 67 శాతం మంది సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలపాలి. అలాగే 14 రాష్ట్ర అసెంబ్లీలు సైతం మద్దతు ఇవ్వాలి. ఇలా జరిగితేనే ఈ బిల్లుకు ఆమోదం లభిస్తుంది. తద్వారా జమిలీ ఎన్నికలకు మార్గం సుగమమవుతుంది. ఒకవేల పార్లమెంటులో లేదా రాష్ట్రాల నుంచి మద్దతు దొరకకపోతే ఈ బిల్లు ఆమోదం సాధ్య కాదు.

2027 టార్గెట్

ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది శీతాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ బిల్లుకు పార్లమెంట్‌లో మద్దతు లభించినట్లైతే 2027లో ఉత్తరప్రదేశ్ ఎన్నికలతో పాటు దేశం మొత్తం ఒకేసారి



అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. అలాగే ఈ ఎన్నికలు జరిగిన 100 రోజుల తర్వాత మున్సిపల్, గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారు. దేశంలో పరిపాలన సౌలభ్యం కోసమే ఈ జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ ఘోషి తెలిపారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, హర్యానా, జమ్మూకశ్మీర్ తదితర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. వీటికి 2029 వరకు పాలించే హక్కు ఉంటుంది. అలాగే త్వరలో మహారాష్ట్ర, రఖార?ండ్, వచ్చే ఏడాది ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో తెలంగాణలో కూడా అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ రాష్ట్రాలు తమకు మిగిలి ఉన్న పాలనాకాలాన్ని రద్దు చేసుకొని జమిలీ ఎన్నికలకు మద్దతిస్తాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రాంతీయ పార్టీలకు నష్టం !

అయితే మెజార్టీ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది. దీనివల్ల జమిలీ ఎన్నికలు సాధ్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని పలువురు నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే 2027లో జమిలీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. మరోవైపు జమిలీ ఎన్నికలు నిర్వహిస్తే ప్రాంతీయ పార్టీ అస్థిత్వానికి దెబ్బపడుతుందని మరికొందరు అంటున్నారు. జమిలీ ఎన్నికల్లో రాష్ట్రాల సమస్యలు కాకుండా జాతీయ సమస్యలపైనే ఓటర్ల దృష్టి మళ్లుతుందని.. దీనివల్ల బీజేపీ పార్టీకే అనుకూలంగా ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నారు. మరీ జమిలీ ఎన్నికలు జరుగుతాయా ? లేదా ? అనేది తెలియాలంటే మరికొంత కాలం వేచిచూడాల్సిందే. వచ్చే శీతాకాల సమావేశంలో దీనిపై ఓ స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది.

# ప్రియాంకపై పోటీచేసే నవ్య హరిదాస్ ఎవరో తెలుసా..?

హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గత లోక్ సభ ఎన్నికల్లో వయనాడ్, రాయ్ బరేలి నియోజకవర్గాల నుంచి పోటీచేసి విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, కేరళ రాష్ట్రంలోని వయనాడ్ పార్లమెంట్ స్థానానికి రాహుల్ గాంధీ రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైం ది. కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికలకు సంబంధించి ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. నవంబర్ 13వ తేదీన వయనాడ్ ఉప ఎన్నిక జరగనుంది. ఈ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రాహుల్ గాంధీ సోదరి, కాంగ్రెస్ మహిళా నేత ప్రియాంక గాంధీ వాద్రా పోటీ చేయనున్నారు. అయితే, బీజేపీ అధిష్టానం ప్రియాంక గాంధీపై పోటీకి నవ్య హరిదాస్ (39)ను బరిలోకి దింపేందుకు నిర్ణయించింది. దీంతో ఇప్పుడు అందరి దృష్టి నవ్య హరిదాస్ పై పడింది. ప్రియాంక గాంధీని ఎదుర్కొనే సత్తా నవ్య హరిదాస్ ఉందా..? ఇంతకీ ఆమె ఎవరు.. ఆమె రాజకీయ ప్రస్థానం ఏమిటి అనే విషయాలపై చర్చ జరుగుతుంది.నవ్య హరిదాస్ వృత్తిరిత్యా సాఫ్ట్ వేర్ ఇంజనీర్. ఆమెకు 39 సంవత్సరాలు. రాజకీయాలపై ఆసక్తి ఉండటంతో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. అయితే, కొద్దికాలంలోనే బీజేపీలో ఆమె తనదైన ముద్ర వేసుకున్నారు. దీంతో అధిష్టానం దృష్టిని ఆకర్షించారు. ఆమె భర్త పేరు శోభిన్ శ్యామ్. నవ్య 2007లో కాలికట్ యూనివర్సిటీలో కేఎంసీటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసింది. ఆ తరువాత మెకానికల్ ఇంజనీర్ గా



కొద్దిరోజులు ఉద్యోగం చేశారు. రాజకీయాలపై ఆసక్తితో ఆమె బీజేపీలో కి ఎంట్రీ ఇచ్చింది. కోజికోడ్ కార్పొరేషన్ లో రెండు సార్లు కౌన్సిలర్ గా నవ్య హరిదాస్ పనిచేశారు.బీజేపీలో మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగానూ నవ్య హరిదాస్ పనిచేశారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా కొజికోడ్ దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థిపై ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో 24,873 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు. నవ్యకు రూ. 1,29,56,264 విలువైన ఆస్తులు ఉన్నాయని, మొత్తం రూ. 1,64,978 అప్పులు ఉన్నాయని ఏడీఆర్ తెలిపింది.

# బీఆర్ఎస్ లో ఆధిపత్య పోరు పీక్స్ కు?



హైదరాబాద్,గత ఏడాది డిసెంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పరాజ యం పాలైన నాటి నుంచీ బీఆర్ఎస్ సంక్షోభం నుంచి సంక్షోభంలోకి కూరుకు పోతున్నట్లుగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ ప్రతిపక్ష స్థానంలోకి వచ్చి పదేళ్లయినా ఇంకా కుదురుకోలేదు. హైడ్రా, మూసీ ప్రక్షాళన వంటి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలతో పుంజుకోవడానికి వచ్చిన అవకాశాలను సైతం ఆ పార్టీ అంతర్గత విభేదాలతో చేజార్చుకుంటోంది. దీనికి తోడు పార్టీ అధినేత ఓటమి తరువాత ఫాం హౌస్ కే పరిమితం కావడం కూడా పార్టీ రోజు రోజుకూ క్షీణించడానికి కారణంగా మారింది. గత పది నెలలుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రెండు మూడు సందర్భాలతో తప్ప ప్రజలలోకి వచ్చింది లేదు. పార్టీ నేతలకు కూడా అందుబాటులోకి రావడం లేదని ఆ పార్టీ శ్రేణులే చెబుతున్నాయి. ఒక విధంగా ఒక్క పరాజయంతో కేసీఆర్ కాడె వదిలేశారని పార్టీ శ్రేణులే భావిస్తున్నాయి.అధినేత నిష్క్రియాపరత్వం కారణంగా పార్టీలో ఆధిపత్య పోరు పీక్స్ కు వెళ్లిందంటున్నారు. ముఖ్యంగా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి, కేసీఆర్ తనయుడు అయిన కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) మాజీ మంత్రి, కేసీఆర్ మేనల్లుడు అయిన హరీష్ రావుల మధ్య పార్టీ నిట్టనిలువుగా చీలిపోయిందని పార్టీ వర్గాలే చెబుతున్నా యి. బీఆర్ఎస్ రెండవ శ్రేణి నాయకత్వం, క్యాడర్ లో చాలా వరకూ మాజీ మంత్రి హరీష్ రావు వెనుక ర్యాలీ అవుతుంటే.. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పార్టీలో తన స్థానాన్ని, ఆధిపత్యాన్నీ నిలుపుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంలో కేటీఆర్, హరీష్ రావుల మధ్య పెరిగిన దూరం పార్టీలో సమన్వయం లేకుండా పోవడానికి కారణమౌతోంది.మాజీ మంత్రి హరీష్ టార్గెట్ గా కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నా.. బీఆర్ఎస్ నుంచి హరీష్ రావుకు పెద్దగా మద్దతు లభించడం లేదు. సిద్దిపేటలో హరీష్ రావు రాజీనామా చేయాలంటూ ఫ్లెక్సీలు, పోస్టర్లూ వెలిసినా, కేటీఆర్ పెద్దగా సీరియస్ గా తీసుకోలేదు. రైతు రుణమాఫీ విషయంలో హరీష్ రావు రాజీనామా చేయాలని, లేదంటే అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించడానికి కూడా కేటీఆర్ ఎందుకో ముందుకు రాలేదు.దీంతో తనపై రేవంత్ చేసిన వ్యాఖ్యలకు హరీష్ రావే స్వయంగా కౌంటర్ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఈ పరిణామాలను గమనిస్తున్న పరిశీలకులు బీఆర్ఎస్ లో వర్గపోరు ఆరంభమైందనీ, ఇది కేటీఆర్ వర్సెస్ హరీష్ రావుగా రూపాంతరం చెందడానికి పెద్దగా సమయం తీసుకునే అవకాశాలు లేవనీ అంటున్నారు. ఈ ఊహాగానాలు ఇలా సాగుతుండగానే.. వాటికి బలం చేకూర్చే విధంగా తాజాగా కేటీఆర్ తాజాగా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ కోసం ఏర్పాటు చేసిన స్క్రీన్ పై రెండు బీఆర్ఎస్ లోగోలు ఉన్నాయి.వాటిలో ఒక దానిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫొటో ఉంటే.. రెండో దానిపై కేటీఆర్ ఫొటో ఉంది. దీంతో బీఆర్ఎస్ లో హరీష్ రావు ప్రాధాన్యత తగ్గించి పార్టీ పగ్గాలను కేటీఆర్ చేపట్టనున్నారన్న వాదన పార్టీ శ్రేణుల్లోనే మొదలైంది. కేటీఆర్ ప్రణాళికాబద్ధంగా పార్టీలో హరీష్ ప్రాధాన్యతను తగ్గించే విధంగా పావులు కదుపుతున్నారన్న భావన వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో కూడా హరీష్ కు పార్టీలో అన్యాయం జరుగుతోందంటూ పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. మొత్తం మీద బీఆర్ఎస్ లో అంతర్గత పోరు పతాకస్థాయికి చేరిందని పరిశీలకులు విశ్లేషిస్తున్నాయి.

# మారిన నేత.. కేరాఫ్ జగన్... నిజమేనా..!



అమరావతి,వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌లో మారిన మనిషిని చూడొచ్చా? ఇప్పుడు ఇదే ప్రశ్న వైసీపీలో వ్యక్తమవుతోంది. ఆయన పూర్తిగా మార్పు దిశగా అడుగులు వేస్తున్నారా అంటే ప్రస్తుతం జరిగిన నాలుగు సమావేశాలను గమనిస్తే కొంత మార్పు అయితే కనిపిస్తోంది. ఒకప్పుడు అంతా "నేనే" "నన్ను చూసే ప్రజలు ఓట్లు వేశారు" "నేను ఇచ్చిన టికెట్లు నేను చేసిన ప్రచారంతోనే ఎమ్మెల్యేలు గెలిచారు" అని బహిరంగంగా చెప్పకపోయినా అంతర్గత సమావేశాల్లో పదేపదే జగన్ చెప్పుకొచ్చారు."నేను లేకపోతే నీకు పదవి ఏముంది అన్న" అంటూ మాట్లాడిన సందర్భాలు కూడా ఉన్నాయి. కొందరు కొత్త ముఖాలను పరిచయం చేసినప్పుడు చాలామంది "వాళ్లు గెలుస్తారా గెలవరా" అని సందేహం వ్యక్తం చేసిన సమయంలో "అసలు వాళ్లను చూసి ఎవరు ఓటేస్తారు నన్ను చూసి కదా ఓటేస్తారు" అని చాలా గర్వంగా జగన్ చెప్పుకొచ్చారు. మైలవరం అదేవిధంగా సింగనమల నియోజకవర్గాల్లో ఏ మాత్రం ప్రభావం చూపించలేని వ్యక్తులను నాయకులుగా నిలబెట్టి టికెట్లు ఇచ్చినప్పుడు జగన్ ఇదే ధైర్యం, ఇదే 'నేను' అనే భావనను ప్రదర్శించారు."మొత్తంగా అసలు నాయకుల ప్రమేయం ఏమీ లేదు నేను చెప్పింది నేను చేసిందే శాసనం నన్ను చూసే గెలిపిస్తున్నారు" అనే వాదనను జగన్ ఎక్కువగా వినిపించారు. అయితే భయంకరమైన ఓటమి తర్వాత ఆయనలో కొంత రియలైజేషన్ కనిపించినట్టు తెలుస్తోంది. తాజాగా జరిగిన నాలుగు సమావేశాల్లో కూడా "మీరంతా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుంది. క్షేత్రస్థాయిలో మీరు చేసే ప్రచారంతోనే పార్టీ పుంజుకుంటుంది. పార్టీలో అందరూ కష్టపడాలి" అని జగన్ చెప్పుకొచ్చారు.నిజానికి 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు కూడా ఇలా చెప్పలేదు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించండి అని మాత్రమే గీతోపదేశం చేసిన జగన్.. ఇప్పుడు మాత్రం మీరు పని చేయండి మీరు ప్రజల్లోకి వెళ్ళండి మీరు బలంగా ఉండండి అని చెప్పడం ద్వారా తన వల్ల పార్టీ బలోపేతం కాలేదు కాబోదు అని ఒప్పుకున్నట్టే అయింది. దీనిని బట్టి భవిష్యత్తులో వైసిపి కార్యకర్తలకు నాయకులకు జగన్మోహన్ రెడ్డి ఫ్రీ హ్యాండ్ ఇవ్వడంతో పాటు వారికి గుర్తింపు ఇచ్చే దిశగా కూడా అడుగులు వేస్తున్నట్టుగా భావించాల్సి ఉంటుంది. మరి ఇది ఎంతవరకు నిలబడుతుంది. ఎంతవరకు పార్టీకి ప్రయోజనం చేకూరుస్తుందనేది చూడాలి.

## ఉచిత ఇసుక ఎక్కడో చెప్పండి

విశాఖపట్నం,కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయా లని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. ఉచిత ఇసుక ఎక్కడ దొరుకుతుందో చెప్పాలని ప్రశ్నించారు. ఎప్పటి నుంచి ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకువస్తారో చెప్పాలని నిలదీశారు. గతంలో ఇసుక దోచే శారన్నారు కదా..

# రెండు సీట్లు.. కూటమి పాట్లు.. ఢిల్లీకి చేరిన పంచాయతీ!

న్యూఢిల్లీ,ఎందుకంటే.. స్వతంత్ర అభ్యర్థులు సహా.. కమ్యూనిస్టులు బలపరిచిన వారు కూడా ఈ ఎన్నికలను ప్రభావితం చేస్తుంటారు. అదేవిధంగా వైసీపీ, కాంగ్రెస్ కూడా పొంచి ఉన్నాయి.ఏపీలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఇవి రెండూ కూడా.. పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) కోటాలో భర్తీ అవుతున్నవే. 1) ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన సీటు. 2) ఉమ్మ డి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కోటా. ఈ రెండు స్థానాలు కూడా..ఎన్నికల రూపంలోనే భర్తీ కానున్నా యి. ఆయా జిల్లాల్లో ఓటు నమోదు చేసుకున్న గ్రాడ్యుయేట్లు ఎన్నికల్లో పాల్గొని ఓటు వేయనున్నారు. సహజంగానే రెండు సీట్లు కూడా హాట్‌హాట్‌గానే ఉన్నాయి.ఎందుకంటే.. స్వతంత్ర అభ్యర్థులు సహా.. కమ్యూనిస్టులు బలపరిచిన వారు కూడా ఈ ఎన్నికలను ప్రభావితం చేస్తుంటారు. అదేవిధంగా వైసీపీ, కాంగ్రెస్ కూడా పొంచి ఉన్నాయి. ఇలాంటి సమయంలో కూటమి పార్టీల్లో ఈ సీట్లను ఎవరికి ఇవ్వాలన్న అంశం ఇబ్బందిగా మారింది. ఇన్నవి రెండే సీట్లు కావడంతో తాము తీసుకుంటామని.. టీడీపీ చెబుతోంది. అంతేకాదు.. తమ పార్టీ తరఫున అభ్యర్థులను కూడా ఖరారు చేసింది. వీరు ప్రచారం కూడా ప్రారంభిం చారు.గుంటూరు, కృష్ణా జిల్లాల కోటాలో తెనాలి మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను చంద్రబాబు ఎంపిక చేశారు. ఇటీవల ఎన్నికల్లో ఆయన సీటును త్యాగం చేసి.. జనసేనకు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇక, గోదావరి జిల్లాల కోటాలో పేరాబత్తుల రాజశేఖర్‌ను ఎంపిక చేసుకున్నారు. వీరి పోటీని సీఎం చంద్రబాబు కూడా ఖరారు చేశారని.. పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



కానీ, కూటమిలో ఉన్న జనసేన, బీజేపీలు.. రెండు సీట్లలో ఒకటి తమకు ఇవ్వాలని పట్టుబడుతున్నాయి.దీనికి టీడీపీ ససేమిరా అంటోంది. వచ్చే సారి అవకాశం వస్తే.. మీరు తీసుకుందురు.. అని ముక్తాయించిం ది. దీంతో జనసేన కొంత మేరకు వెనక్కి తగ్గింది. కానీ, బీజేపీ మాత్రం పట్టు బిగించి.. ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లింది. ఇటీవల 20 నామినేటెడ్ పదువులు భర్తీ చేస్తే.. కేవలం రెండు స్థానాలే ఇచ్చారని.. కాబట్టి ఇప్పుడు ఒక ఎమ్మెల్సీ సీటును తమకు కేటాయించాలని కమల నాథులు లొల్లి పెడుతున్నారు. దీంతో ఆలపాటిని కన్ఫర్మ్ చేసిన టీడీపీ.. పేరాబత్తుల విషయాన్ని మాత్రం పెండింగులో పెట్టింది. దీంతో ప్రచారం ప్రారంభించిన రాజశేఖర్.. హఠాత్తుగా ఆగిపోయారు. ఢిల్లీలో పంచాయతీ ఎలాంటి మలుపు తిరుగుతుందో చూడాలి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESARA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com